
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 18 ఏప్రిల్ 2025



హోటళ్లు.. హాస్టళ్లలో ఐజీ తనిఖీలు

బ్రాడీపేటలో కాలినడకన ఎస్పీతో కలిసి పర్యటన



బ్రాడీపేట నాలుగో లైన్‌లో పర్యటిస్తున్న ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం రాత్రి రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల నెల్లూరులో రాత్రి 11 గంటల సమయంలో ఓ హోటల్లో ఇద్దరు కొట్టుకొని ఒకరిని హత్య చేశారు. ఈ ఘటన నేపథ్యంలో రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య అన్ని జిల్లాల్లో పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిందిగా డీజీపీ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. దీంతో గురువారం రాత్రి ఐజీ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్ శంకర్‌విలాస్ సెంటర్ నుంచి బ్రాడీపేట నాలుగో లైన్ మీదగా కోబాల్డ్ పేట ఎత్తు రోడ్డు వరకు కాలినడకన పర్యటించారు. సమయం దాటిపోయిన తర్వాత తెరిచి ఉన్న దుకాణాలు, హోటళ్లను తనిఖీ చేసి వారికి హెచ్చరికలు జారీ చేశారు. నిర్ణీత సమయానికి మూసి వేయాలన్నారు. అదేవిధంగా వర్కింగ్ ఉమెన్స్, జెంట్స్ హాస్టళ్లను తనిఖీ చేశారు. హాస్టళ్లతో పాటు వ్యాపార సముదాయాలు వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, రిజిస్టర్లు నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట, పట్టాభిపురం, నగరం పాలెం పోలీస్ అధికారులు, సిబ్బంది ఐజీ వెంట ఉన్నారు.

12 రోజులు.. రూ.35.97 కోట్లు



- ముస్సిపాల్టీలకు కాసులే కాసులు
- కలిసివస్తోన్న 5 శాతం పన్ను రాయితీ
- స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తున్న యజమానులు
- ప్రథమస్థానంలో అద్దంకి.. నాల్గోస్థానంలో గురజాల

ఆస్తి పన్ను చెల్లించండి.. అని ప్రచారాలు చేయకుండానే. కుళాయిలు కట్ చేస్తామని బెదిరింపులు అవసరం లేకుండానే.. యజమానులు పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించగా పన్ను చెల్లింపుదారులు దానిని సద్వినియోగం చేసుకునేందుకు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు కాసులు వర్షం కురుస్తోంది. ఈ నెల 6వ తేదీ నుంచి పన్నుల చెల్లింపులపై రాయితీ ప్రకటించగా కేవలం 12 రోజుల్లో యజమానులు రూ.35.97 కోట్లు చెల్లించారు. గతంలో పన్నుల వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేసేవారు. కొన్ని దగ్గర్ల అయితే బకాయిలు చెల్లించని వారి కుళాయిలు కట్ చేయడం.. నోటీసులు ఇవ్వడం లాంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చేది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం రాయితీ ప్రకటన యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేలా చేసింది. ఈ రాయితీ ప్రకటనతో అధికారులు ఊహించని స్థాయిలో చెల్లింపులు జరిగాయి. ఇందులో పాత బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్ పన్నులు కూడా ఉన్నాయి. స్వచ్ఛంద పన్ను చెల్లింపులో రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మున్సిపాల్టీ ప్రథమ స్థానంలో, పల్నాడు జిల్లా పరిధిలోని గురజాల మున్సిపాల్టీ నాల్గో స్థానంలో నిలిచాయి.





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆస్తి పన్ను రాయితీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటన మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి విశేషస్పందన లభిస్తోంది. రాయితీ అవకాశాన్ని యజమానులు సద్వినియోగించుకుంటున్నారు. 6వ తేదీ నుంచి విస్తృతంగా పన్ను చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.35.97 కోట్లు పన్నులు చెల్లించా రు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలలో పన్ను రాయితీని వినియోగించుకుని యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేందుకు బారులు తీరుతున్నారు. గతంలో పన్నుల వసూళ్లకు మున్సిపల్ సిబ్బంది ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితి లేకుండానే పన్నుదారులు ఎవరికి వారు మున్సిపల్ కార్యాలయాలకు తరలివచ్చి మరీ రాయితీపై పన్ను చెల్లిస్తున్నారు. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మున్సిపాల్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకే రాయితీ అమలు కానున్నది. పన్నుదారులు స్పందించి పన్ను చెల్లిస్తుండటంతో ఊహించని విధంగా వసూలు జరుగుతోంది.

పల్నాడులో నరసరావుపేట అత్యధికం

పల్నాడు జిల్లాలో ఎనిమిది మున్సిపాల్టీలకు సంబంధించి రూ.12.74 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను డిమాండ్ రూ.47.01 కోట్ల ఉండగా రూ.59.75 కోట్లు వసూలుచేయాల్సి ఉంది. కాగా 5 శాతం రాయితీపై ఇప్పటికి రూ.5.35 కోట్లు వసూలైంది. జిల్లాలో అత్యధికంగా నరసరావుపేట మున్సిపాల్టీలో రూ.1.60 కోట్లు పన్ను వసూ లైంది. వినుకొండలో రూ.77లక్షలు, చిలకలూరిపేటలో రూ.72లక్షలు, పిడుగురాళ్లలో రూ.57 లక్షలు, సత్తెనపల్లిలో రూ.74లక్ష లు, మాచర్లలో రూ.35 లక్షలు, దాచేపల్లిలో రూ.28 లక్షలు, గురజాల మున్సిపాల్టీలో రూ.17 లక్షలు చెల్లింపులు జరిగాయి.

గుంటూరు జిల్లాలో రూ.27.12 కోట్లు

గుంటూరు జిల్లాలో పన్ను బకాయిలు రూ.206.76 కోట్లు కాగా ప్రస్తుత సంవత్సరం డిమాండ్ రూ.218.76 కోట్లు ఉంది. బకాయిల్లో రూ 1.16 కోట్లు, డిమాండ్‌లో రూ.25.96 కోట్లు మొత్తం రూ.27.17 కోట్లు వసూలైంది. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.18.77 కోట్లు, తెనాలిలో రూ.2.86 కోట్లు, మంగళగిరి.. తాడేపల్లిలో రూ.4.85 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీలో రూ.64 లక్షలు చెల్లించారు.

బాపట్ల జిల్లాలో చీరాల ప్రథమం

బాపట్ల జిల్లాలోని మున్సిపాల్టీల్లో బకాయిలు రూ.13.05 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ రూ.29.80 కోట్లు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.42.85 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అయితే రాయితీపై ఇప్పటి వరకు రూ.3.45 కోట్లు వసూలైంది. చీరాల మున్సిపాల్టీలో రూ.1.16 కోట్లు, బాపట్లలో రూ.83 లక్షలు, రేపల్లెలో రూ.60 లక్షలు, అద్దంకి మున్సిపాల్టీలో రూ.84 లక్షలు పన్నులు చెల్లించారు.

వేలితో... గ్యాస్ మంటను ఆపొచ్చు

- ఆకట్టుకున్న అగ్నిమాపకశాఖ మాక్ డ్రిల్
- పాల్గొన్న శాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్



8

మాక్ డ్రిల్‌లో భాగంగా విద్యార్థులతో అగ్నిమాపకశాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్

ప్రత్యేక ఉపాధ్యాయులకు.. తీపికబురు



- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 248 పోస్టులు
- స్పెషల్ బీఈడీ అభ్యర్థులతో భర్తీకి సన్నాహాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 248కి పైగా పోస్టులను ఇప్పటికే గుర్తించారు. ఆయా పోస్టులను స్పెషల్ బీఈడీ పూర్తి చేసిన అభ్య ర్థులతో భర్తీ చేయనున్నారు. ప్రత్యేక అవస రాల విద్యకు సంబంధించి శిక్షణా కేంద్రాలను సమగ్ర శిక్ష నిర్వహిస్తోంది. ఇందులో మానసిక, శారీరక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తు న్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అనేక జడ్పీ స్కూల్స్‌లో స్పెషల్ బీఈడీ పోస్టులు ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ బీఈడీ పోస్టులు 2260 ఉండగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీ పోస్టులు 151, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 98 ఉన్నాయి. మెగా డీఎస్సీలోనే స్పెషల్ బీఈడీ పోస్టులు కలిపి భర్తీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 72 పైగా భవిత కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల విద్య విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఫిజియోథెరపి, యోగా, మానసిక దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా విద్యను అందిస్తున్నారు. స్పెషల్ బీఈడీ పూర్తిచేసిన వారి ద్వారా ఇక్కడ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసి ఆయా కేంద్రాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల్ని నియమించే అవకాశం ఉందని సంఘాల నాయకులు చెబుతున్నారు.

పోస్టులకు పోటీ తక్కువే..

స్పెషల్ బీఈడీ పోస్టులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నా పోటీ మాత్రం తక్కువగానే ఉంటుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒకప్పుడు హైదరాబా దులోనే స్పెషల్ బీఈడీ కళాశాలలు ఉండేవి. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో కూడా కొన్ని మేనేజ్‌మెంట్స్ స్పెషల్ బీఈడీ కోర్సులు ప్రవేశ పెట్టారు. అయితే కోర్సు పూర్తి చేసిన వారు తక్కువ మంది ఉంటారని విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులకు తక్కువ పోటీ ఉంటుందని చెబుతున్నారు.

8

డాలర్ డ్రీమ్స్ ఢమాల్

ఉన్నత చదువుల కోసం విదేశాలకు విద్యార్థులు

పార్ట్‌టైం జాబ్స్‌కు నెలకొన్న తీవ్ర పోటీ

నెలవారీ ఖర్చులకు తల్లిదండ్రులే ఆధారం

కుటుంబ వ్యవస్థకు సవాలు

● సమాజంలో పెరిగిపోతున్న వివాహేతర బంధాలు ● తాత్కాలిక ఆకర్షణకు లొంగి.. విలువలకు తిలోదకాలు ● బాపట్ల నడిబొడ్డున ఇద్దరు మృత్యువాత కలకలం

మిర్చి కమీషన్ లైసెన్సుల కోసం దరఖాస్తుల జోరు


6

● టీడీపీ నేతలు, అధికారుల సిఫార్సులు ● ఒక్కో లైసెన్సుకు రూ. 10 లక్షలు పలుకుతున్న ధర

ఉపాధ్యాయులకు ఊరట

- ఎట్టకేలకు తొలగిన యాప్‌ల కష్టాలు
- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- మాట నిలుపుకున్న మంత్రి నారా లోకేశ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరుకు యాప్.. ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్.. మధ్యాహ్న భోజనం అమలుకు యాప్.. మరుగుదొడ్ల నిర్వహణకు యాప్.. విద్యార్థుల మార్కులు అప్‌లోడుకి యాప్.. ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు ఇంతకాలం అల్లాడిపోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌లతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోధన పక్కన పెట్టాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్‌ల కష్టాల నుంచి ఊరట కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు నిత్యం పదికిపైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ తాజాగా అమల్లోకి వచ్చింది. విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500 పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.75 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశపెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు పదికిపైగా యాప్‌లో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.



నూతన యాప్ నమూనా

ఇక అన్నింటికీ ఒకే యాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడు చేసుకుని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో వినియోగిస్తున్న లాగిన్లను పాస్వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

పనిభారం తగ్గింపు : డీఈవో రేణుక



నూతన యాప్ వల్ల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గుతుందని డీఈవో రేణుక తెలిపారు. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకే యాప్‌లో నమోదు చేయడం వలన అనేక ప్రయోజనలు ఉంటాయన్నారు. ఇప్పటికే జిల్లాలోని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు యాప్ వివరాలు, ఇన్‌స్టలేషన్, ఉపయోగించే విధానం గురించి తెలియజేశామని తెలిపారు. గతంలో ఉన్న యాప్‌లను అన్ ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్వర్డ్ ఒకచోట నమోదు చేసుకుని తర్వాత అన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

..ఇక రయ్ రయ్

- ఇప్పటికే పలు రహదారుల విస్తరణకు ఆమోదం
- రాజధాని అమరావతి, సముద్ర తీరం కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి
- భూసేకరణ దశలో వినుకొండ-గుంటూరు, నిజాంపట్నం-గుంటూరు రోడ్లు
- తెనాలి- నారాకోడూరు, తెనాలి- మంగళగిరి రోడ్లకు ఇప్పటికే ఆమోదం
- గుంటూరు బాపట్ల, గుంటూరు-పర్చూరు రోడ్ల విస్తరణకు అడుగులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆం ధ్రజ్యోతి): ఒకవైపు రాజ ధాని అమరావతి కేంద్రం.. మరోవైపు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలు జిల్లా కేంద్రాలు.. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సూర్యలంక తీరం.. వీటన్నింటి మధ్య రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణాలు, విస్తరణలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే పలు రోడ్ల పనులు ప్రారంభం కాగా మరికొన్ని ప్రతిపాదనల దశలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తి అయితే ఇక అమరావతి, మూడు జిల్లా కేంద్రాలు, సూర్యలంక తీరం మధ్య రాకపోకలకు ఆటంకాలు లేకుండా రయ్‌రయ్ మంటూ వాహనదారులు రాకపోకలు చేసే అవకాశం ఉంటోంది. రాజధాని అమరావతి పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని ప్రాంతం కావడంతో పాటు.. సమీపంలోనే తీర ప్రాంతం ఉండడంతో వాటి కనెక్టివిటీనీ పెంచేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో గుంటూరులోని పలు రహదారులకు మహర్దశ పట్టింది. జిల్లాలో అత్యంత కీలకమైన రహదారులను జాతీయ రహదారులుగా మార్చి, నాలుగు లేన్ల రహదారులుగా విస్తరించేందుకు ఆర్ అండ్ బీ ప్రయత్నిస్తోంది. గుంటూరు, రాజధాని అమరావతికి కనెక్టివిటీలో అత్యంత కీలకమైన వినుకొండ- గుంటూరు, నిజాంపట్నం- గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. వాటికి సంబంధించిన భూసేకరణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఆరునెలల్లో భూసేకరణ ప్రక్రిను పూర్తి చేసి రహదారులను విస్తరించనున్నారు. ఈ రెండు రోడ్ల కోసం కేంద్రం రూ.3,105.3 కోట్లు ఖర్చు చేయనుంది. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా జిల్లాలో మరో రెండు రోడ్లను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదముద్ర వేసింది. తెనాలి- నారా కోడూరు, తెనాలి-మంగళగిరి రోడ్లను నాలుగు రోడ్లుగా విస్తరించడానికి అడుగులు పడుతున్నాయి. వాటికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అయితే వాటితోపాటు మరికొన్ని రోడ్లను విస్తరించాలని ఆర్అండ్‌బీ భావిస్తోంది.

మూడు జిల్లాల్లో రోడ్లకు మహర్దశ



పాత మద్రాసు రోడ్డు విస్తరణ?

రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో సూర్యలంక బీచ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కూడా

(మిగతా 8లో)

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

● నలుగురి అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. కొద్దికాలంగా కృష్ణా కెనాల్ రైల్వే జంక్షన్ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారంతో తాడేపల్లి సీఐ కళ్యాణరాజు నిఘా పెట్టి నలుగురిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనలో తాడేపల్లి పట్టణానికి చెందిన పీత దినేష్‌కుమార్ కోటిసూర్య గణేష్, ఉండవల్లి సెంటర్ కు చెందిన మల్లిశెట్టి అనిల్, పెనుమాకకు చెందిన కళ్లం అనిల్‌రెడ్డిలను అరెస్టు చేసినట్టు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ కళ్యాణరాజు ఎస్ఐ ఖాజావలిని, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల విజేతలతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి తదితరులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తూర్పు మాలపల్లెలో మూడు రోజులపాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. మొత్తం 12 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. విజయవాడ స్కై క్లబ్ జట్టు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో హైదరాబాద్ సాయి అకాడమీ జట్టు, తృతీయ స్థానంలో గుంటూరు కేఎల్ యూనివర్సిటీ జట్టు, చతుర్థ స్థానంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ జట్టు విజేతలుగా నిలిచాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పోటీలు సమర్థవంతంగా నిర్వహించిన అంబేద్కర్ మెమోరియల్ కమిటీని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశంసించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పిల్లి కోటి, షైం గణేష్, కె అశోక్, పిల్లి లెనిన్, గేరా రాము, కమలా బోడిబాబు, గట్టుపల్లి మాణిక్యరావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎన్ ఎస్ ఎన్ ఐ ఎస్ పటియాలా సంస్థలో ప్రవేశాలకు ఎమ్ ఎస్ సీ స్పోర్ట్స్ కోచింగ్, పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డిఎస్‌డివో పి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 2వ తేదిలోపు 'ఎస్ఎస్‌సీ. ఎన్ఎస్ఎన్ఐఎస్. ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 515.00 అడుగులు ఉంది. ఇది 140.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మిర్చి కమీషన్ లైసెన్సుల కోసం దరఖాస్తుల జోరు

● టీడీపీ నేతలు, అధికారుల సిఫార్సులు
● ఒక్కో లైసెన్సుకు రూ. 10 లక్షలు పలుకుతున్న ధర



గుంటూరులోని మిర్చియార్డు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కమీషన్ ఏజెంట్ లైసెన్సుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు మార్కెటింగ్ శాఖ డైరెక్టరేట్‌కు వెళుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గం సిఫార్సు చేసిన 10 లైసెన్సులే పెండింగ్‌లో ఉండగా కొత్తగా మరో 25 అప్లికేషన్లు కమిషనర్ కార్యాలయానికి పంపారు. ఇందులో తెలుగుదేశం పార్టీ నేతలు సిఫార్సు చేసినవి 15 వరకు ఉండగా వాటిని అడ్డు పెట్టుకొని యార్డులో లోగడ పని చేసిన అధికారులు మరో 10 చేర్చి పంపించారు. ఇందుకోసం ఒక్కో లైసెన్సుకు రూ. 10 లక్షల వరకు బేరసారాలు జరుగుతున్నాయని మార్కెట్ కమిటీలో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వీటిపై కమిషనర్ నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడుతుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరులో 683 కమీషన్ ఏజెంట్ లైసెన్సులు ఉన్నాయి. వీళ్లల్లోనే కొద్ది మందికి వేలం కేంద్రాలు(షాపుల) కేటాయింపు జరగలేదు. మిర్చియార్డులో కొత్తగా దుకాణాలు నిర్మించే పరిస్థితి అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో గతంలోనే అప్పటి కమిషనర్ ప్రద్యుమ్న కొత్తగా ఒక్క కమీషన్ ఏజెంట్ లైసెన్సు కూడా ఇవ్వడానికి వీల్లేదని తన వద్దకు వచ్చిన దరఖాస్తులన్నింటిని తిరస్కరించి ప్రభుత్వానికి నివేదించారు. కాగా మిర్చియార్డు ఛైర్మన్‌గా మన్నవ సుబ్బారావు ఉన్న సమయంలో కొంతమంది డైరెక్టర్లు తమకు కమీషన్ ఏజెంట్ లైసెన్సులు కావాలని దరఖాస్తు చేసుకొన్నారు. అయితే నిబంధనల ప్రకారం డైరెక్టర్లకు లైసెన్సులు ఇవ్వడానికి లేదు. దాంతో అవి అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఇటీవలే ఆయా డైరెక్టర్లు మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి ఆయనతో సిఫార్సు చేయించుకొన్నారు.

మరోవైపు తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటూరు నగరం నుంచి 15 మందికి కమీషన్ ఏజెంట్ లైసెన్సులు ఇవ్వాలని లేఖలతో సిఫార్సులు చేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులు నలుగురు తమ అనుచరులకు మిర్చి కమీషన్ ఏజెంట్ లైసెన్సులు ఇవ్వాలని లేఖలు రాశారు. వీటన్నింటికి ఏఎంసీ సెక్రెటరీ, డీఏటీ అండ్ ఎంవో నుంచి సమగ్ర నివేదికలను మార్కెటింగ్ అధికారులు తెప్పించుకొన్నారు. అయితే లైసెన్సు మంజూరు చేయలంటే త్రీమెన్ కమిటీ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. కమీషన్ లైసెన్సులపై ఇటీవలకాలంలో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. దాంతో రేపటి రోజున అవి ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటాయోనని గత కొన్ని నెలల నుంచి మార్కెటింగ్ ఉన్నతాధికారులు లైసెన్సుల అంశాన్ని పెండింగ్‌లో పెడుతున్నారు. అయితే లేఖలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు మాత్రం లైసెన్సులను ఏమి చేశారని పదేపదే ప్రశ్నిస్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి అధికారులకు నెలకొన్నది.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు ఆదేశాలు



కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు , అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్న దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని గుంటూరు జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్‌డీఏ కమిషనర్ కె కన్నబాబు ఆదేశించారు. గురువారం గుంటూరు కలక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో ఆయన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి సీఆర్డీఏ పరిధిలో నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన కొలువుదీరే సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ఇతర విభాగాలు పనుల పునఃప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. సీఆర్డీఏ పరిధిలో చేపట్టనున్న నిర్మాణాలకు వచ్చే కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, అసాంఘిక శక్తుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించే విధంగా పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగినపుడు వైద్యులను, అంబులెన్స్, మందులు అందుబాటులో వుంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. రాజధాని పరిధిలో వున్న పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్డేట్ చేయడం జరిగిందని, కార్మికులకు అవసరమైన వైద్య చికిత్స అందించడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి కమిషనర్‌కు తెలిపారు. నిర్మాణ పనులకు కార్మికులు కుటుంబాలతో పనులకు వస్తారు. కాబట్టి వారి కుటుంబాలలోని చదువుకునే పిల్లలను దగ్గరలోని స్కూల్స్‌లో, పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ పీడీ, డీఈవోకి సూచించారు. నిర్మాణ రంగానికి సంబంధించి కాంట్రాక్టర్ల నియామకం ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు చట్టపరంగా అందించవలసిన సౌకర్యాలపై దృష్టి పెట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. నిర్మాణ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ చక్కగా చేపట్టాలని డీపీవోకు సూచించారు. స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు కాంట్రాక్టర్లతో మాట్లాడి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరమైన మెటీరియల్ అందేలా భూగర్భ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీఈవో రేణుక, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస రెడ్డి, డీపీవో నాగసాయి కుమార్, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవి, మైనింగ్ ఆర్ఐ లావణ్య, ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైళ్లలో ఆన్‌బోర్డు ఏటీఎంలు

● కోచ్ వర్క్‌షాపుల్లో సిద్ధమవుతున్న భోగీలు
● రైలు ప్రయాణంలో నగదుకు ఇక ధోకా లేనట్లే



ఆన్‌బోర్డు ఏటీఎం


గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించుకొనే ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్(ఏటీఎం)లను రైలు భోగీల్లో ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో రైలుకు ఒక ఏటీఎంని ఇన్‌స్టాల్ చేసేందుకు చర్యలు చేపట్టింది. రైలు కోచ్‌లు తయారు అయ్యే వర్క్‌షాపుల్లో ప్రస్తుతం వీటిని అమర్చుతున్నది. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లలో ఆన్‌బోర్డు ఏటీఎంలను అమర్చి వాటికి ప్రయాణీకుల నుంచి లభించే స్పందన ఆధారంగా మరిన్ని రైళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఇప్పటికే ఏటీఎంలను అమర్చుతున్న వీడియో క్లిప్పింగులను ఆ శాఖ విడుదల చేయడంతో ఎప్పుడెప్పుడు రైళ్లలో ఏటీఎంల సేవలు అందుబాటులోకి వస్తాయానని ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు.

ఇప్పటివరకు రైల్వేస్టేషన్ల ఆవరణల్లో మాత్రమే వివిధ బ్యాంకుల ఏటీఎంలు అందుబాటులో ఉన్నాయి. అయితే అవి కొన్ని సందర్భాల్లో పని చేయకపోతుండటంతో నగదు కోసం ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. యూపీఐ యాప్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ ఫిజికల్‌గా నగదు చేతిలో లేకపోతే ప్రయాణీకులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఆన్‌బోర్డు ఫుడ్ సర్వీసెస్ పొందాలంటే తప్పక నగదు చేతిలో ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రయాణీకుల అవసరాలను గుర్తించిన రైల్వే శాఖ ఏటీఎంలను అమర్చేందుకు భోగీలలో అవసరమైన ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నది.

ఆన్‌బోర్డు ఏటీఎంలు ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తే అన్నిరకాల సేవలు పొందవచ్చు. నగదు ఉపసంహరణ, బ్యాంకు అకౌంట్ నుంచి మరో బ్యాంకు ఖాతాకు క్యాష్ ట్రాన్స్‌ఫర్, ఏటీఎం కార్డుల పిన్ ఛేంజ్, గ్రీన్‌పిన్ జనరేట్ చేయడం, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం వంటి అన్ని సేవలు రైలులో ప్రయాణిస్తూనే పొందవచ్చు. ఏటీఎం ఏర్పాటు వలన రైల్వేకు కూడా ఆదాయం సమకూరుతుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

చికిత్స పొందుతూ..

బాపట్ల జంట మృతి



బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్న సంఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నల్లమోతు మాధవి బుధవారం మృతి చెందగా ఆమెతోపాటు తీవ్రంగా గాయపడిన తులాబందుల లక్ష్మీ నారాయణరావు గురువారం మృతి చెందారు. గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మాధవి మృతి చెందగా హైదరాబాద్ ఆపోలో హాస్పటల్‌లో లక్ష్మీనారాయణరావు మృతి చెందారు. వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వీరిని లక్ష్మీనారాయణరావు భార్య తిట్టిందని మనస్థాపంతో బాపట్ల రైల్వేస్టేషన్ దగ్గర పెట్రోల్ పోసుకొని తీవ్రంగా గాయపడిన ఇద్దరు కన్నుమూశారు. విజయలక్ష్మీపురంకు చెందిన నల్లమోతు మాధవి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేట్ రిజర్వేషన్ కౌంటర్ నడుపుకుంటున్న రిటైర్డ్ రైల్వేఉద్యోగి లక్ష్మీ నారాయణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ క్షణికావేశంలో పెట్రోల్ పోసుకొని నిప్పుపెట్టుకొని ఈవిధంగా ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు.

యోగ టీచర్ ఉద్యోగాల పేరుతో మోసం

బుద్ధ యోగ ఫౌండేషన్ నిర్వాహకుడిపై ఫిర్యాదు

ఎస్పీ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బాధితుల ధర్నా



ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యదర్శి వలి, బాధితురాలు సునీత తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో యోగా టీచర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి గుంటూరుకు చెందిన బుద్ధ యోగ సెంటర్ నిర్వాహకుడు వలి తమను మోసం చేశాడని పలువురు బాధితులు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివ రాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించడానికి యోగ టీచర్లను నియమించి విద్యార్థులల్లో ఒత్తిడి తగ్గేలా చర్యలు తీసుకోనుందని, దానికి గాను తమ సంస్థకు నియామక ఉత్తర్వులు ఇచ్చారని వలి తెలిపారు. ఆయుష్ డిపార్ట్ మెంట్ ద్వారా అనుమతి వచ్చిందని, 2022 సంవత్సరంలో గుంటూరుకు చెందిన ఫౌండేషన్ నిర్వాహకుడు సయ్యద్ వలి యోగా వాలంటీర్లు కావా లని ఇచ్చిన ప్రకటన కు, చాలా మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి దా దాపు 2 నెలలు యోగా శిక్షణ ఇచ్చి, యోగా సర్టిఫికేట్ ఇచ్చి విద్యా కమీ షనర్ ద్వారా ఉచిత పొరుగు సేవలపై జీఓ జిల్లా, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రొసీడింగ్ ఆర్డర్స్ జారీ చేయించినట్లు ఆయా పత్రాలు చూపాడన్నారు. యోగా సర్టిఫికెట్ పొందిన వారికి యోగా ఇన్స్టక్టర్ మరి యు యోగా అసిస్టెంట్స్‌గా ప్రభుత్వ పాఠశాలలో నియమించా డన్నారు. వీరికి నమ్మకం కుదిరేందుకు అతి కొద్ది మందికి రెండు నెలలు తానే జీతాలు ఇచ్చాడన్నారు. మొదట 34 వేలు జీతం అని ఆశ చూపి. తర్వాత 25 వేలు ఇస్తామని చెప్పి. విడతల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1400 మందికి పైగా పాఠశాలల్లో నియమించారన్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా ఆయా ఉద్యోగాలు ప్రభుత్వ పరం చేస్తామని ఆశ చూపి ప్రస్తుతం జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. ఇందుకు గాను ఒక్కొక్కరి వద్ద లక్షల రూపాయలు వసూలు చేసాడన్నారు. 5-6 నెలలు 17 వేలు చొ ప్పున కొద్ది మంది ఖాతాల్లో జీతం జమ చేసి. మిగిలింది పీఎఫ్, హెచ్ఆర్ఏ అని న మ్మించాడన్నారు. పీఎఫ్ ఖాతాలు ఎవరికీ తెరవలేద న్నారు. 14 నెలల నుండి జీతాలు ఇవ్వకుండా.ఇబ్బంది పెడుతున్న ఫౌండేషన్ నిర్వాహకుడు వలిపై చర్యలు తీసుకుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,58,818 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,39,333 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,58,818 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 57,411 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12300
నంబరు.5	10000	12600	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10000	13500	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పలాయనం చిత్తగించిన భూమన: మన్నవ


మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాల మృతి అంశంపై వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి తోక ముడిచారని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరాధార ఆరోపణలు చేయడం ఆధారాలు, చూపించమని అడిగితే పలాయనం చిత్తగించడం వైసీపీ నాయకులకు మొదటి నుంచి అలవాటుగా మారిందన్నారు. టీటీడీ ఎస్వీ గోశాలను గోవధ శాలగా మార్చారంటూ భూమన తప్పుడు ఆరోపణలు దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు నిరూపించాలని కూటమి నాయకుల సవాల్‌కు భూమన కరుణాకర్‌రెడ్డి తోకముడిచారన్నారు.

25 నుంచి వేసవి శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఈ నెల 25 నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు కళాశాల కార్యదర్శి కె.వి. బ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, ఫుట్ బాల్, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా, ఆర్చరీ, వెస్ట్రన్ డాన్స్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఆర్.శివాజీ 98497 03144 సంప్రదించాలని తెలిపారు.


మాట్లాడుతున్న తిరుపతిరావు, పాల్గొన్న పాండురంగ విఠల్

పురందేశ్వరి నేడు నగరానికి రాక

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గుంటూరుకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. చంద్రమౌళినగర్‌లో గురువారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కొరిటెపాడు గొట్టిపాటి కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న అంబేడ్కర్ 134వ జయంతి పక్షోత్సవాల్లో ఆమె పాల్గొంటారని చెప్పారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, నాయకులు అంబేడ్కర్, వైవీ సుబ్బారావు, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నిశ్చితార్థం జరిగాక ప్లేట్ ఫిరాయించిన వరుడు

● బాధితురాలి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఓ యువకుడికి, యూట్యూబర్‌కు నిశ్చితార్థం జరిగింది. రెండు రోజుల్లో వివాహం జరగాల్సి ఉండగా వరుడు ప్లేట్ ఫిరాయించాడు. నాకు ఈ పెళ్లి ఇష్టం లేదు.. నేను పెళ్లి చేసుకోను అంటూ మొరాయించాడు. లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులో యూట్యూబర్‌గా ఉన్న యువతికి నల్లచెరువు రెండో లైనుకు చెందిన కైలాష్‌తో మార్చి 10న నిశ్చితార్థం జరిగింది. ఈ నెల 18న వివాహం జరగాల్సి ఉంది. కొంతకాలం ఇద్దరూ కలిసి తిరిగిన క్రమంలో మార్చి 31న వరుడు పెళ్లికి నిరాకరించాడు. దీంతో అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య పెద్ద మనుషుల ద్వారా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా కైలాష్ పెళ్లికి అంగీకరించకపోవడంతో బాధిత యూట్యూబర్ లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడంపై మోడల్ అసోసియేషన్‌ఆఫ్ దళిత ఎంప్లాయీస్(మేడ్) రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, వ్యవస్థాపకుడు శృంగారపాటి శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపవర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం చిరస్మరణీయమైన ఘట్టమన్నారు. అన్ని విభాగాల ఉద్యోగాల్లో, ఉద్యోగోన్నతుల్లో ఉప వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ పాయింట్లు మార్పు చేయాలన్నారు. విద్యాశాఖలో ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగోన్నతులలో, మెగా డీఎస్సీలో ఈ ఆర్డినెన్స్‌కు అనుగుణంగా రోస్టర్ తయారు చేసి మాదిగలకు పూర్తి న్యాయం చేయాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన రైల్వే టీటీఈపై కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహితకు ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేసిన రైల్వే టీటీఈ సురేష్‌కుమార్‌పై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు అయింది. బండారుపల్లికి చెందిన వివాహిత కుటుంబం కొంతకాలంగా ఎస్‌వీఎన్ కాలనీలో ఉంటోంది. వివాహితకు రైల్వే టీటీఈ సురేష్ కుమార్ కొంత డబ్బు వడ్డీకి ఇచ్చాడు. ఇందుగాను ఆమె అధిక వడ్డీ ప్రకారం చాలా వరకు అప్పు చెల్లించింది. ఇంకా ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పాటు కోర్టులో కేసు వేశాడు. ఇలా ఉంటే వివాహితకు టీటీఈ సురేష్ కుమార్ ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు పశ్చిమ అభివృద్ధిలో కూటమి మార్కు


పార్కు రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేసి, ఎన్డీఏ కూటమి అభివృద్ధి మార్కు చూపిస్తానని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం పార్కులో తిరుగుతూ, వాకర్స్‌తో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నమయ్య పార్కుకు రిటైనింగ్ కావాలని కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. వాటిని పరిశీలించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.50లక్షలతో అంచనాలు సిద్ధంచేసి, శంకుస్థాపన చేశామన్నారు. రాబోయే 2, 3 నెలల్లోనే ఈ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. దాతలు కలిసివస్తే, మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో అన్నమయ్య పార్కును అభివృద్ధి చేస్తామని పిలుపునిచ్చారు. వేములపల్లి విఠల్, మాకినేని సాంబశివరావు, పార్క్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆవుల మృతి వైసీపీ మరో నాటకం

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆవుల మృతి అంటూ వైసీపీ మరో నాటకానికి తెరతీసిందని ఎమ్మెల్యే గల్లా మాధవి మండిపడ్డారు. ఆవుల మృతిని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలనే నీచపు ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ సమాజంలో కరోనా వైరస్ మాదిరిగా మారిపోయిందని, ప్రతి రోజు ఏదో ఒక అసత్య ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు.

హీమోఫీలియా రోగులకు అధునాతన వైద్యం

● బాధితులకు ప్రతి నెల రూ.10 వేల ఫించన్

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హీమోఫీలియా రోగులకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అధునాతన వైద్య సేవలు లభిస్తున్నాయని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. అంతర్జాతీయ హిమోఫీలియా దినోత్సవం పురస్కరించుకొని జీజీహెచ్ శుశృత హాల్‌లో గురువారం జరిగిన అవగాహన సభలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో హీమోఫీలియా రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాట్లోకి తెచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే హీమోఫీలియా రోగులకు ప్రతి నెల రూ.10 వేలు ఫించన్ అందజేస్తున్నామని ఆయన వెల్లడించారు. గత ఏడాది ప్రభుత్వాస్పత్రిలో హీమోఫీలియాతో బాధపడుతున్న నాగదుర్గ అనే యువతికి రూ.1.30 కోట్లు వెచ్చించి వైద్యం అందించినట్లు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ గుర్తుచేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఇప్పటి వరకు జీజీహెచ్‌లో రికార్డుస్థాయిలో హీమోఫీలియా రోగులకు ఫ్యాక్టర్ మందులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, డాక్టర్ దేవకుమార్, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ మురళీ, డాక్టర్ పోలయ్య, హీమోఫీలియా సొసైటీ కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

ఎక్కడా చెత్త కనిపించకూడదు..

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, పరిసరాలు అద్దంలా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనియోజకవర్గంలో సిల్టు కుప్పలుగానీ, చెత్త సమస్యలుగానీ ఉండకూడదని తేల్చి చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సిల్టు వర్కర్లతో పని చేయించాలని సూచించారు. 24 గంటలూ శానిటరీ ఆఫీసర్లకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

సివిల్స్ పుస్తకాల ఆవిష్కరించిన మంత్రి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆయుష్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి సివిల్స్ అభ్యర్థుల కోసం స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్, విద్యావేత్త డాక్టర్ పి.వి.లక్ష్మయ్య, దినేశ్‌కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన వరల్డ్ జియోగ్రఫీ, కరెంట్ జియోగ్రఫీ పుస్తకాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. స్థానిక హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీబీ ఎస్పీ సుధాకర్, ఒంటేరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు ప్రారంభం


శ్రీకృష్ణ తులాభారంలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళా వేదికపై గురువారం, శ్రీ టీవీ కళాంజలి క్రియేషన్స్, డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి పుట్టగుంట ప్రభాకరరావు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథులుగా కావూరి సత్యనారాయణ, నల్లక శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథి డాక్టర్ వలేటి అప్పారావు పాల్గొని, ప్రసంగించారు. అనంతరం శ్రీ దుర్గా భవాని నాట్యమండలి శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్య నాటకం ఆరాధ్యుల ఆదినారాయణరావు నిర్వహణలో జరిగింది. కృష్ణుడిగా ఆదినారాయణ, నారదుడుగా డి. వెంగళబాబు, వసంతకుడుగా డి. వెంకటరామ్, సత్యభామగా జయమాధురి, రుక్మిణిగా లక్ష్మీజ్యోతి, నళినిగా రాణి పౌరాణి పద్యాలతో నాటకాభిమానులను అలరించారు. నాటకానికి సంగీతం శ్రీనివాసరావు, డోలక్‌పై సాంబిరెడ్డి చక్కటి సహకారాన్ని అందించారు.

ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు


బుడంపాడు డ్రోన్ పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ-వేస్ట్ సేకరణ పై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ-వేస్ట్ అందించే ప్రజలు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 విస్తరణ పనుల్లో భాగంగా స్వర్ణభారతి నగర్‌లో ప్రభావితమయ్యే ఆక్రమణదారులకు ఇప్పటికే ఇంటి పట్టాలు ఇచ్చామని, చట్ట ప్రకారం నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. అనధికార మీడియా డివైస్ డిస్‌ప్లే బోర్డులను స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. త్వరలో రెండో వెండింగ్ జోన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను సోమవారం నుంచి పునః ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాలు బుడంపాడు, నగరాలు, గోరంట్లలో కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం పర్యటించారు. పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు గుర్తించామని తెలిపారు. బుడంపాడులో గత పర్యటనలో ఆదేశించిన పనుల్లో జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ అమరావతి రోడ్ ఐడీ హాస్పిటల్ వద్ద గల అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. టిఫిన్ చేస్తూ ప్రజలతో మాట్లాడారు.


తిరుపతిలో జరిగిన సదస్సులో పాల్గొన్న గుంటూరు ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల

తిరుపతి సదస్సుకు మేయర్ సజీల హాజరు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన 16వ ఫైనాన్స్ కమిషన్ అర్బన్ అండ్ లోకల్ బాడీస్ సదస్సుకు గురువారం గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల హాజరయ్యారు. గుంటూరు నగరంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఆమె ఈ సదస్సులో కోరారు.

చలమయ్య కళాశాలలో ముగిసిన శిక్షణ తరగతులు


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కర్పూరపు సూర్యనారాయణ

గుంటూరు విద్య ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో రెండు నెలలుగా డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు "డిజిటల్ మార్కెటింగ్"పై జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, బాపూజీ విద్యా సంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు, ట్రెజరర్ చందోలు జయప్రకాష్, ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలసికట్టుగా పురోభివృద్ధికి కృషి చేయాలి

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాయకులు కలిసికట్టుగా ఉండి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పురోభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎన్జీవో రిక్రియేషన్ హాలులో గురువారం నగర కార్యవర్గ ఎన్నిక జరిగింది. నగర శాఖ అధ్యక్షుడు సూర్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ ఎన్జీవో సమాచారం పత్రికకు ఉద్యోగులను చందాదారులుగా చేర్చాలని కోరారు. సహాధ్యక్షుడిగా సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్.రామకృష్ణ, ట్రెజరర్‌గా జీవీ కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ఎం సురేష్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్కే. పయాజ్‌అహ్మద్ ఎన్నికయ్యారు.

కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు



ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వెలవెల

● మండుటెండలతో తగ్గిన ప్రయాణికుల రద్దీ

● పడిపోయిన రోజువారీ చార్జీల ఆదాయం

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి రోజువారి ప్రయాణికుల రద్దీ క్రమంగా తగ్గుతోంది. నిత్యం ప్రయాణికులతో కోలాహలంగా ఉండే ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ నేడు వెలవెలబోతోంది. మండుటెండలతో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. సాధారణంగా గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి ప్రయాణికులతో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రం గుంటూరు నుంచి రోజువారీగా వేలాది మంది ప్రయాణికులు గమ్య స్థానాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కేవలం టిక్కెట్ల చార్జీల రూపంలోనే రెండు డిపోలకు దాదాపుగా నిత్యం రూ.38లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే తాజాగా ప్రయాణికుల రద్దీ తగ్గడంతో ఈ ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు తగ్గిపోయే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రభావంతో బస్టాండులో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. కాగా త్వరలోనే విద్యార్థులకు వేసవి సెలవులు ఉండడం, శుభకార్యాలు కూడా జరగనుండడంతో ప్రయాణికుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.


ప్రయాణికుల్లేక కళావిహీనంగా ఉన్న ఎన్‌టీఆర్ బస్టాండ్


సీఎస్ విజయానంద్ నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన కలెక్టర్, ఎస్పీ

ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు

● సీఎస్‌కు నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు ప్రణాళికాబద్ధంగా తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ సెక్రటరీ ఉచిత ఇసుక విధానం, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు భూసేకరణ, తాగునీటికి వేసవి కార్యాచరణ ప్రణాళిక, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్, ఎంఎస్ఎంఈ సర్వే, పార్కులు, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర తదితరఅంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి, సూచనలు అందించారు. కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ ఎ.భార్గవ్ తేజ, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూములు గుర్తించడం జరిగిందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నగరపాలక సంస్థతో అనుసంధానమైన ఏజెన్సీకి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎస్‌కు వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్కే. ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీఓ సాయికుమార్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘ నాయకులు

19న నగరంలో 'రన్ ఫర్ జీసస్'

గుంటూరు(తూర్పు),ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకొని శనివారం వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టర్ రెవరెండ్ జి.సతీష్ బాబు తెలిపారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చిలో పోస్టర్లు ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఉదయం 6 గంటలకు నగరంపాలెంలోని వెస్ట్ ప్యారిస్ చర్చి నుంచి ప్రారంభమై కంకరగుంట ఫ్లైఓవర్, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, శంకర్ విలాస్ మీదగా సాగి ఏసీ కాలేజీ వద్ద కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. క్రైస్తవ సంఘ నాయకులు, విశ్వాసులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ మల్లెల రాజు, పాల్ మనోహర్, బాబు ఆశీర్వాదం, రత్న ప్రసాదు, ఆనందపాల్, విల్సన్, పరిశుద్ధరావు పాల్గొన్నారు.

మజ్జిగ, తాగునీటి చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం నరేంద్రకుమార్‌చౌదరి, మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కోటిరెడ్డి తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ గుంటూరు మాడ్యూల్ ఆధ్వర్యంలో నగరంపాలెంలోని మెయిన్ బ్రాంచి ఈ-కార్నర్ ఎదుట మజ్జిగ, తాగునీటి చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీయల్ ఫైనాన్స్ బ్రాంచి (ఐఎఫ్‌బీ) గుంటూరు డీజీఎమ్ నరేంద్రకుమార్‌చౌదరి, స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రటరి కోటిరెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. గుంటూరు మెయిన్ బ్రాంచి ఏజీఎమ్ రామ్‌ప్రసాద్, చీఫ్ మేనేజర్(హెచ్‌ఆర్) కిశోర్‌కుమార్, ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరి జయకుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ డీజీఎస్ సుధాకర్(సేవా), ఏజీఎస్ విజయబాబు, సొసైటీ ప్రెసిడెంట్ కృష్ణమోహన్‌బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇక సరికొత్తగొల్లపాలెం!

- సీఎం పర్యటనతో మారుతున్న రూపురేఖలు
- స్వర్ణ గ్రామం కావాలంటూ పిలుపు
- పీ4 విధానంతో 33 కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగు
- వేగంగా హామీల అమలుకు యంత్రాంగం కసరత్తు
- గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.3.67 కోట్ల నిధుల విడుదల
- నోడల్ అధికారిగా డీఆర్డీఏ పీడీ నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కొత్తగొల్లపాలెంను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. మారుమూల ఉండే ఈ గ్రామాన్ని పింఛన్ల పంపిణీ వేదికగా చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు అక్కడి ప్రజల సాదకబాధలు సావధానంగా విన్నారు. అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. జీవనోపాధి నుంచి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ వరకు అన్ని విషయాలపై గ్రామస్తులతో చర్చించారు. ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీకోసం సీఎం పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామంపై సీఎం వరాలజల్లు కురిపించారు. వాటి అమలుకు కలెక్టర్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ప్రజావేదిక సభలో సీఎం ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4లో భాగంగా గ్రామంలోని 33 నిరుపేద కుటుంబాలను మార్గదర్శకుల చేతిలో పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సీఎం హామీల అమలు, చేపట్టాల్సిన పనులు, సంక్షేమ పథకాల విషయంలో కలెక్టర్ వెంకటమురళి సారథ్యంలో ఓ దఫా సమీక్ష జరిగింది. అంశాల వారీగా జాబితాను అధికారులు సిద్ధం చేసుకున్నారు. తొలి దశలో గ్రామాభివృద్ధికి రూ.30లక్షల నిధుల విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. క్రమం తప్పకుండా వాటిపై సమీక్షలు జరపడంతో ఏటీఆర్‌ను కూడా యాక్షన్‌ప్లాన్‌లో భాగం చేసుకోనున్నారు. కొత్తగొల్లపాలెంలో పీ4 అమలుకు సంబంధించి డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

గ్రామంలో గుర్తించిన ప్రజా సమస్యలు

గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని 17 కుటుంబాలను అధికారులు గుర్తించారు. సొంతిల్లు లేని 13 కుటుంబాలకు నివాసయోగ్యం కల్పించే బాధ్యతను హౌసింగ్ పీడీకి అప్పగించారు. 30 మందికి పింఛన్లు, ఒకరికి రేషన్ కార్డు, విద్యుత్ కనెక్షన్లు 4, వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నాలుగింటిని గుర్తించారు. ఏడుగురికి బీసీ కార్పొరేషన్ రుణాలు, మరో ఏడుగురికి సదరన్ సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. గ్రామ జనాభానే 904 కాగా, సీఎం పర్యటన తర్వాత వివిధ పథకాల ద్వారా దాదాపు 95 కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా పీ4 అర్హత కుటుంబాల సంఖ్య అదనం.

గ్రామాభివృద్ధి ఇలా..

గ్రామంలోని శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్లు, పబ్లిక్ కొళాయిల ద్వారా సమృద్ధిగా తాగునీరు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం, రామాలయం పూజారికి ఇచ్చిన హామీ, గ్రామం మొత్తం ఫైబర్ నెట్ సౌకర్యం, కేజీబీవీని అందుబాటులోకి తేవడం సీఎం ఇచ్చిన హామీలలో ముఖ్యంగా ఉన్నాయి. వీటికి చాలావరకు అధికారులు ప్రతిపాదనలతో పాటు ఎస్టిమేషన్ వ్యయాన్ని సిద్ధం చేశారు. త్వరలోనే వీటన్నింటిని పట్టాలెక్కించే విధంగా కసరత్తు చేస్తున్నారు.

పీ4 అమలుకు నివేదిక

పీ4 కార్యక్రమం అమలులో భాగంగా కొత్తగొల్లపాలెలోని నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తెస్తామని సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వ సర్వేలో 33 కుటుంబాలు ఈ కార్యక్రమానికి అర్హులని గుర్తించారు. సదరు కుటుంబాల అవసరాలేంటి, ఏ స్థాయిలో వాటిని భర్తీ చేస్తే ఆర్థికంగా వారు నిలదొక్కుకోగలరు అనే అంశాలపై నివేదిక ఇవ్వడానికి డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును నోడల్ అధికారిగా కలెక్టర్ నియమించారు. పీడీ శిక్షణ నిమిత్తం వారంరోజుల సెలవులో ఉండడంతో ఆయన రాగానే పీ4 కార్యక్రమం ఊపందుకోనుంది. నివేదిక విషయలో ఓ అంచనాకు వచ్చిన యంత్రాంగం దాని ఆధారంగా మార్గదర్శకులతో చర్చించి, పీ4కు తుదిరూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

నెలన్నరలో పరిష్కారం

మొత్తం హామీలను వివిధ శాఖలకు అప్పగించడంపై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. ఆయా పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చడంలో సాంకేతిక చిక్కులను తొలగించడంపై యంత్రాంగం దృష్టిపెట్టింది. సీఎం కోరుకున్నట్లు నెలన్నర వ్యవధిలోనే కొత్తగొల్లపాలెం గ్రామం రూపురేఖలు మార్చడంతో పాటు గ్రామస్తులు అన్ని విధాల ఆదుకునే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి.



కొత్తగొల్లపాలెం గ్రామస్థుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు (ఫైల్)




ఎం.వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలి

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మే నెలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత కోరారు. ఈ మేరకు గురువారం అమరావతి రోడ్డులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ ఎం.వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం లలిత మాట్లాడుతూ టేక్ హోం రేషన్‌తో వేసవి సెలవులు ఇస్తే పిల్లలకు మంచిదనే తల్లితండ్రుల అభిప్రాయాలను పరిగణనలో తీసుకోవాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చేందుకు జీవో విడుదల చేయలేదని, కొత్త బాల సంజీవని 2.0 సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సారమ్మ, వాణిశ్రీ, అరుణ తదితరులు ఉన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలి

- ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య



మాట్లాడుతున్న ఆర్ లక్ష్మయ్య, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికుల రక్షణ కోసం సామాజిక సంక్షేమ చట్టం తీసుకురావాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. లక్ష్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర 65 డాలర్లు ఉంటే దేశంలో డీజిల్ లీటర్ ధర రూ.33లు ఉండాలని, అందుకు భిన్నంగా రూ.100 ఉందని పేర్కొన్నారు. దీంతో రవాణా కార్మికులపై భారం పడుతోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు టోల్‌గేట్లు అప్పగించడంతో వాటిపై పర్యవేక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. వీటిని ఐక్యంగా తిప్పికొట్టేందుకు మే 20 జరిగే సార్వత్రిక సమ్మెలో రవాణా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో పదివేల రూపాయలు ఇచ్చినట్లే ఇచ్చి మరో చేతితో లాక్కుందని దుయ్యబట్టారు. సమావేశంలో కె.దుర్గారావు, సురేష్, పోలినాయుడు, కె.నాగేశ్వరరావు, బి.లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, మస్తాన్ వలి, ఎం.హరిపోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు పునరుద్ధరించాలి

- ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి లుక్సన్

గుంటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చైల్డ్ కేర్ లీవ్‌లు ఇవ్వాలని, గ్యారేజ్‌లలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 ను అమలు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నబ్బాయి, నాయకులు డీవీ శంకరరావు, అమరనాథ్, పీఎస్ రావు, ఎస్‌వీ రావు, ఎన్‌వీ రెడ్డి, మహిళా ఉద్యోగులు ఉన్నారు.

..ఇక రయ్ రయ్

(5వ పేజీ తరువాయి)

కేటాయించింది. స్వదేశీ దర్శన్- 2.0 కింద బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.97.52 కోట్లు కేటాయించింది. దీనికి తోడు ఇప్పటికే బాపట్ల జిల్లాగా మారడం, ఎన్‌హెచ్-216 జాతీయ రహదారి బాపట్ల గుండా వెళుతుండడంతో కనెక్టివిటీ పెరిగింది. ఈ నేపథ్యంలో బాపట్ల నుంచి గుంటూరు, రాజధానికి మధ్య రాకపోకలు బాగా పెరిగాయి. ఈ అవసరాలను ప్రస్తుతం ఉన్న గుంటూరు- చీరాల రోడ్డు తీర్చలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆ రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించాలన్న ప్రతిపాదనలు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ రోడ్డును నాలుగు వరసల రోడ్డుగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు గుంటూరు-పర్చూరు రోడ్డును కూడా నాగులుప్పలపాడు వరకు నాలుగు రోడ్లుగా విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుంటూరు- పర్చూరు- ఒంగోలు- నెల్లూరు మీదగా వెళ్లే ఈ రోడ్డును గతంలో పాత మద్రాసు రోడ్డు అని పిలచేవారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు పర్చూరు వద్ద నకిరేకల్లు- ఓడరేవు జాతీయ రహదారి కూడా అనుసంధానం అవుతోంది. దీంతో ఆ రోడ్డుపై కూడా రద్దీ పెరిగింది. ఆ రోడ్డు గుంటూరు- ప్రత్తిపాడు- పెదనందిపాడు- పర్చూరు- ఇంకొల్లు మీదగా 84.5 కి.మీ వెళ్లి నాగులుప్పలపాడు వద్ద ఒంగోలు- దిగమర్రు జాతీయ రహదారి ఎన్‌హెచ్-216లో కలుస్తుంది. దీంతో గుంటూరు- నాగులుప్పలపాడు మధ్య కూడా ఈ రోడ్డును నాలుగు రోడ్లుగా విస్తరించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు రోడ్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇస్తే ఆ రెండు రోడ్లు కూడా నాలుగు రోడ్లుగా విస్తరిస్తారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

డాలర్ డ్రీమ్స్ ధమాల్



- ఉన్నత చదువుల కోసం విదేశాలకు విద్యార్థులు
- పార్ట్‌టైం జాబ్స్‌కు నెలకొన్న తీవ్ర పోటీ
- నెలవారీ ఖర్చులకు తల్లిదండ్రులే ఆధారం
- వీసా స్పాన్సర్ చేసే కంపెనీల్లో ఉద్యోగం ప్రశ్నార్థకం

● నగరంలోని బ్రాడీపేటకు చెందిన ఒక వాచ్‌మెన్ తన కుమార్తెని సంపన్నురాలుగా చూడాలని సర్వం ధారపోసి మూడేళ్ల క్రితం అమెరికాలోని డల్లాస్‌కు పంపించారు. రెండేళ్లలో చదువు పూర్తి అయినా నేటికీ ఆమెకు హెచ్1బీ వీసా స్పాన్సర్ చేసే కంపెనీలో ఉద్యోగం లభించలేదు. దీంతో పార్ట్‌టైం జాబ్‌లోనే కొనసాగుతోంది. మరో ఆరు నెలల్లో వీసా రాకపోతే స్వదేశానికి రావాల్సిందే.

● స్థానిక శ్రీనివాసరావు పేటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆస్తినంతా బ్యాంకులో తనఖా పెట్టి కొడుకుని యూకే పంపించారు. అక్కడ కనీసం పార్ట్‌టైం జాబ్ కూడా దొరకడం లేదు.

● స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల పరిసర ప్రాంతానికి చెందిన ఒక టైలర్ తన కొడుకుని యూఎస్‌లో ఎంఎస్ చేసేందుకు పంపించారు. చదువు అయిపోయి ఏడాది గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. దీంతో ఇక్కడినుంచి ప్రతినెలా డబ్బులు పంపుతూ ఆర్థికంగా చితికి పోతున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో చదువుకుని ఉద్యోగం సాధించాలన్న స్వదేశీ విద్యార్థుల కలలు కల్లలవుతున్నాయి. డాలర్ల ఆశలో ఏటా లక్షల సంఖ్యలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడా, యూకే వెళ్తున్నారు. అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకొంటూనే యూనివర్సిటీల ఫీజులు, నెలవారీ ఖర్చులు సమకూర్చుకోవచ్చని ఇక్కడే ప్లానింగ్ చేసుకుంటున్నారు. అయితే ఆయా దేశాల్లో అడుగు పెట్టిన తర్వాత కాని అసలు విషయం వారికి బోధపడటం లేదు. చదువు అయిపోయాక వీసా స్పాన్సర్ చేసే కంపెనీల మాట పక్కన పెడితే.. అసలు అక్కడ జీవించడానికి, రూమ్ అద్దె చెల్లించడానికి పార్ట్‌టైం ఉద్యోగాలకు కూడా ఎగబడాల్సిన పరిస్థితి నెలకొంది. వేర్‌హౌస్‌లలో ప్యాకింగ్, రవాణ వాహనాల్లోకి ప్యాక్ చేసిన వస్తువుల లోడింగ్, కేక్‌లు, బ్రెడ్‌లు సప్లై చేయడం వంటి పనులకు పోటీ నెలకొంది. అక్కడ క్లీనింగ్, వంటగదుల్లో పని చేయడానికి మాత్రమే కాస్తో..కూస్తో పార్ట్‌టైం జాబ్స్ దొరుకుతున్నాయి. ఈ పనులు చేయలేక ప్రతి నెలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి, నెల అద్దె రూ.30వేలు, తిండి, ట్రాన్స్‌పోర్టు ఇతరత్రా ఖర్చులకు రూ. 30 వేలు కలిపి రూ.60 వేలు వరకు పంపించమని కోరుతున్నారు.

మధ్యతరగతి ఆశలు..

ఎంఎస్ చేసేందుకు విదేశాలకు తమ పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులు మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన వాళ్లే ఉంటున్నారు. అప్పో సొప్పో చేసి రూ.30 లక్షలు సమకూర్చుకుని కొడుకు, కుమార్తెని విదేశాలకు పంపించేస్తే వాళ్ల జీవితం సెటిల్ అయిపోతుందని భావిస్తున్నారు. ఇందుకోసం ఉన్న ఆస్తులు, బంగారం బ్యాంకులలో తనఖా పెడుతున్నారు. ఇక ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ సంస్థలు అయితే ఆకర్షణీయమైన ప్రకటనలతో వారికి వల విసురుతున్నాయి. 'మీరు మాకు చిల్లి గవ్వ చెల్లించాల్సిన అవసరం లేదు. మాకు అక్కడి యూనివర్శిటీనే కమీషన్ ఇస్తుంది. పైగా మీ అబ్బాయి, అమ్మాయిని మా సంస్థ ద్వారా పంపిస్తే ల్యాప్‌టాప్, ఫ్లయిట్ టిక్కెట్‌లో ఏదో ఒకటి ఇస్తాం' అని ఆకర్షిస్తున్నాయి. అమెరికాకు వెళ్లాలంటే జీఆర్‌ఈ/టోఫెల్‌లో ఉత్తీర్ణులు కావాలి. ఈ పరీక్షని కూడా కన్సల్టెన్సీ వాళ్లే రాస్తున్నారు. యూకేలోని విశ్వవిద్యాలయాలు అయితే ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే సీట్లు ఇచ్చేస్తున్నాయి. వీసా కోసం రూ.15 లక్షలు యూనివర్శిటీ ఫీజు చెల్లించి మరో రూ.15 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చూపించాలి. ఇన్స్యూరెన్స్ కోసం రూ.2 లక్షలు చెల్లించాలి. బ్యాంకులో డిపాజిట్ చూపించేందుకు కన్సల్టెన్సీ సంస్థలే రూ. 2 శాతం వడ్డీకి నగదు ఇచ్చి వీసా మంజూరు కాగానే ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేస్తున్నాయి.

విదేశాల్లో దిగిన తర్వాత అసలు కష్టాలు

వీసా తీసుకొని విదేశాల్లో అడుగు పెట్టిన విద్యార్థులకు ఎయిర్‌పోర్టు వద్ద నుంచే అసలు విషయం బోధపడుతోంది. ప్రతీ దానికి అమెరికా, కెనడాలో అయితే డాలర్లు, యూకేలో అయితే పౌండ్లు ఖర్చు చేయాలి. ఎయిర్ పోర్టుల నుంచి కన్సల్టెన్సీలు చూపిన రూంలు సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అక్కడికి క్యాబ్‌లో వెళ్లడానికి రూ.5 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. రూంలో ఇద్దరికి వసతి కల్పిస్తున్నారు. ఇందుకోసం అద్దె నెలకు రూ. 60 వేలు చెల్లించాలి. అంటే చెరి రూ.30 వేలు ఇవ్వాలి. ఇక ఆ రూం నుంచి యూనివర్సిటీకి వెళ్లాలంటే బస్సులు, రైళ్లు ఎక్కాలి. ఇందుకోసం నిత్యం డాలర్లు/పౌండ్లు ఖర్చు చేయాల్సిందే.

తిండికి తిప్పలు

మన దేశంలో వలే అక్కడ ఆహార పదార్థాలు తక్కువ ధరకు లభించవు. కేజీ బియ్యం కొనుగోలు చేయాలంటే రూ. 240 ఖర్చు చేయాలి. హోటల్ నుంచి ఏదైనా బిర్యానీ లాంటి ఫుడ్ ఆర్డర్ పెట్టాలంటే రూ.900 వరకు అవుతుంది. కూరగాయలు ఏవీ కేజీ రూ.100కి తక్కువగా దొరకవు. పాలు, పండ్లు కూడా అదే పరిస్థితి. ఇక్కడ నిత్యం వెరైటీల వంటకాలు చేయించుకొని తినే వాళ్లు అక్కడ సమయానికి బ్రెడ్, పాలు దొరికితే చాలు అని తృప్తి పడాల్సిన పరిస్థితి.

పార్ట్‌టైం జాబ్‌ల కోసం కళ్లు కాయలు కాసేలా

ఆయా దేశాల్లో జీవించాలంటే కచ్చితంగా పార్ట్‌టైం జాబ్ చేసుకోవాల్సిందే. వారానికి 20 గంటలు మించి పని చేయడానికి నిబంధనలు అంగీకరించవు. కొరియర్, ఫుడ్ డెలివరీ వంటి ఉద్యోగాలు చేయాలంటే ఇక్కడి డ్రైవింగ్ లైసెన్సులు అక్కడ పనిచేయవు. దీంతో ఎక్కువమంది వేర్‌హౌస్‌లలో ప్యాకింగ్ సెక్షన్‌లో పని చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. వాటికి అక్కడ విపరీతమైన డిమాండ్ ఉంది. పార్ట్‌టైం ట్యూటర్ జాబ్‌లున్నా వీళ్లకి అంత పరిజ్ఞానం, స్కిల్స్ లేకపోతుండటంతో వాటికి ఎంపికకావడం లేదు. దీంతో ఇక్కడ మురాపని అని నామోషీగా భావించే వాళ్లు అక్కడ లారీలలోకి ప్యాకింగ్ చేసిన వస్తువులు లోడింగ్ పని అయినా చేయడానికి ఏమాత్రం సంశయించడం లేదు. కానీ, ఇక వెళ్లిన వెంటనే పార్టుటైం ఉద్యోగాలు దొరకడం లేదు. దాంతో ప్రతి నెలా ఇక్కడి నుంచి తల్లిదండ్రులకు ఎట్టలేదన్నా నెలకు రూ.60వేలు పంపించాల్సిన పరిస్థితి. దీంతో వాళ్ల ప్రతి నెలా అడిగిన మొత్తం పంపించడానికి అప్పుల మీద అప్పులు చేస్తున్నారు.

ఉద్యోగాలపై ఆందోళన

పార్ట్‌టైం జాబ్ కోసమే చుక్కలు కనిపిస్తుండటంతో 20 నెలల తర్వాత తమ చదువు అయిపోతే వీసా స్పాన్సర్ చేసే కంపెనీలు దొరుకుతాయో లేదో తెలియని పరిస్థితి. దీంతో ఇప్పటినుంచే వాళ్లల్లో ఆందోళన నెలకొంటోంది. ఇంత చేసి వీసా స్పాన్సర్ చేసే కంపెనీ దొరకకపోతే మహా అయితే మరో సంవత్సరంపాటు అక్కడ ఉండనిస్తారు. ఆ తర్వాత స్వదేశానికి గెంటేస్తారు.

వారంలో రెండే రోజులు తరగతులు


ఇక్కడ మన విద్యా విధానానికి, అక్కడి యూనివర్సిటీల చదువుకు చాలా వ్యత్యాసం ఉంది. మన దేశంలో ఏ విశ్వవిద్యాలయం, కళాశాల అయినా వారంలో ఆరు రోజులు తరగతులు నిర్వహిస్తాయి. తరచుగా టెస్టులు జరుపుతారు. అలానే ఇంటర్వ్యూలకు యాజమాన్యాలు సిద్ధం చేస్తాయి. అక్కడ అలాంటి పరిస్థితి లేదు. వారంలో కేవలం రెండే రోజులు యూనివర్సిటీలలో తరగతులు నిర్వహిస్తారు. మిగతా ఐదు రోజులు ఖాళీనే. దాంతో విద్యార్థులు జల్సాగా తిరగడం, పార్టుటైం జాబ్‌లకు వెళ్లడం వంటివి చేస్తుంటారు.

కుటుంబ వ్యవస్థకు సవాలు

- సమాజంలో పెరిగిపోతున్న వివాహేతర బంధాలు
- తాత్కాలిక ఆకర్షణకు లొంగి.. విలువలకు తిలోదకాలు
- పెద్దల తప్పునకు రోడ్డున పడుతున్న కుటుంబాలు
- బాపట్ల నడిబొడ్డున ఇద్దరు మృత్యువాత కలకలం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైవాహిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. కట్టుబాట్లను కాదని జీవితాలను భార్యభర్తలు నాశం చేసుకుంటున్నారు. తాత్కాలిక ఆకర్షణలకు లొంగి దశాబ్దాల బంధాలకు బీటలు వేస్తున్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న విడాకుల కేసులకు విచ్చలవిడితనం ఓ కారణంగా తెలుస్తోంది. పెద్దలు చేసిన తప్పు వారి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. తర్వాత వారి భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏళ్ల తరబడి సాగుతున్నప్పటికీ అనైతిక బంధాలు ఏదో ఒక రోజున విషాదాన్నే మిగులుస్తాయి. రెండు కుటుంబాల్లోనూ ఎదురయ్యే పరిణామాల వివాహేతర సంబంధం పెట్టుకున్న వారికి ముందే తెలిసినా.. తాత్కాలిక ఆకర్షణకు లొంగి తమ భవిష్యత్తుతో పాటు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. వారు కూడా సమాజం ముందు దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి రావడమో లేక అవమానాలు ఎదుర్కోవడమో జరుగుతోంది. దాదాపు 25 ఏళ్లుగా వివాహేతర బంధంలో ఉన్న ఇద్దరి ప్రాణాలు అగ్నికి ఆహుతైన ఘటన బాపట్ల పట్టణం నడిబొడ్డున ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. మన సమాజంలో అత్యంత బలంగా వేళ్లానుకున్న కుటుంబ వ్యవస్థకే ఈ విషాదం సవాల్ విసురుతోంది.



రెండు ప్రాణాలు తీసిన వివాహేత సంబంధం

బాపట్ల పట్టణానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఒకరు ఇంటి పక్కనే ఉంటున్న మహిళతో దాదాపు 25 ఏళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వీరి బంధం ఇరు కుటుంబాల్లోనూ కొన్నేళ్లుగా చిచ్చు రేపుతూనే ఉంది. తరచూ ఇరువైపులా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి ఒకరినొకరు దూషించుకోవడం వరకు వెళ్లింది. ఈ క్రమంలో వివాహేతర బంధం కొనసాగిస్తున్న మహిళ క్షణికావేశంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. ఆమెను కాపాడే క్రమంలో ప్రియుడికి మంటలు అట్టుకున్నాయి. తీవ్ర గాయాలతో ఇద్దరూ మూడు రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూశారు. రెండు కుటుంబాలు ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నాయి. వారి పిల్లలూ స్థిరపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఘటన చర్చకు దారి తీసింది.

స్వీయ నియంత్రణే కీలకం

బయటకు వెళితే ఎన్నో ఆకర్షణలు ఎదురవుతుంటాయి. ఆ సమయంలో ఒక్కసారి కుటుంబాన్ని, మనమీద ఆధారపడ్డ వాళ్లను గుర్తుచేసుకుని మనల్ని మనం నియంత్రించుకోగలిగితే ఎటువంటి అనర్థాలకు అవకాశం విశ్లేషకులు చెబుతున్నారు. ఆ నియంత్రణ మన కుటుంబ భవిష్యత్తునే నిర్దేశిస్తుందని సూచిస్తున్నారు.

వేలితో గ్యాస్ మంటను ఆపొచ్చు

- ఆకట్టుకున్న అగ్నిమాపకశాఖ మాక్ డ్రిల్
- పాల్గొన్న శాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గుంటూరు లోని నెక్స్‌జన్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ ఆద్యంతం ఆకట్టుకుంది. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో కంగారు పడకుండా తప్పించుకోవడం, మంటలను అదుపులోకి తీసుకురావడంపై గుంటూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదట సిబ్బంది కొన్ని ప్రయోగాలు ప్రదర్శించి, ఆ తర్వాత విద్యార్థులతో వాటిని చేయించారు. అగ్నిమాపక శాఖ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్ సమక్షంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. చుట్టూ గోడలు ఉన్న ప్రదేశంలో అగ్నిప్రమాదం జరిగితే అందులో చిక్కుకున్న వాళ్లు ఎలా బయటకు తీసుకురావాలో తొలుత చూపించారు. తదుపరి గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే వాటిని ఎలా ఆర్పాలో చూపించారు. సిలిండర్‌లో మంటలు చెలరేగినప్పుడు గ్యాస్ బయటకు వచ్చే రెగ్యులేటర్ వద్ద వేలును ఉంచి అదుపు చేయవచ్చునని విద్యార్థులకు డెమో ఇచ్చారు. తర్వాత అదే ప్రయోగాన్ని చిన్న పిల్లలతో కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ రీజినల్ అధికారి ఎంఏక్యూ జిలానీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డి, స్థానిక అధికారులు శ్రీనివాసరావు, కృష్ణా రెడ్డి, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎత్తుకొని బయటకు తెస్తున్న దృశ్యం



అగ్నిప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స



సిలిండర్‌లో మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో చూపిస్తున్న దృశ్యం

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం జరిగిన వేలంలో 896 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,161, గరిష్ఠ ధర రూ.12,275 మోడల్‌ధర రూ.11,851 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,800, గరిష్ఠధర రూ.12,311 మోడల్‌ధర రూ.11,851 పలికాయి.

పశ్చిమ డెల్టా కాల్వకు 300 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. మార్చినెలలో సాగునీటి విడుదలను నిలిపివేసిన అధికారులు, ప్రజల తాగునీటి అవసరాల కోసం, చెరువులు, బావులు నింపేందుకు గానూ సీతానగరం నుంచి మధ్యాహ్నం 300 క్యూసెక్కులనీటిని విడుదల చేయగా సాయంత్రానికి 500 క్యూసెక్కులకు, శుక్రవారం ఉదయానికి 1000 క్యూసెక్కులకు నీటి విడుదల పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు కొండపాటూరు అమ్మవారికి కుంకుమపూజ

కాకుమాను, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరులో స్వయంభు శ్రీపోలేరమ్మ వారికి శుక్రవారం కుంకుమపూజ జరుగుతుందని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తినేని అనీల్‌కుమార్, ఆలయ ఈవో బీ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కుంకుమ పూజ ఏర్పాట్లును ఉత్సవ కమిటీ చైర్మన్ అనీల్‌కుమార్, ఈవో సురేష్‌బాబు స్థానికులు పర్యవేక్షించారు.

తాడేపల్లి ఎస్‌ఐగా ప్రతాప్



డీఎస్పీ మురళీకృష్ణను కలిసిన ఎస్‌ఐ ప్రతాప్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పోలీసుస్టేషన్‌కు మరో ఎస్‌ఐగా గతంలో ఇక్కడ పనిచేసిన ప్రతాప్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణను, సీఐ కళ్యాణరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతాప్ గతంలో తాడేపల్లి దుగ్గిరాల, తెనాలి రూరల్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.

నేడు ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్నెపాడు గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే రామాంజనేయులు వస్తున్నట్లు ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు వెల్లడించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం అతి పురాతనం కావటంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు దేవదాయశాఖ నుంచి రూ.35 లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని, ఈ నేపథ్యంలో జీర్ణోద్ధరణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేస్తున్నట్లు వివరించారు.

రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతు



కవాతు నిర్వహిస్తున్న రెడ్ షర్ట్ వలంటీర్లు

మంగళగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జన సేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో భాగంగా రెడ్ షర్ట్ వలంటీర్లు గురువారం కవాతు నిర్వహించారు. తొలుత సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ చినకాకానిలో యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రెడ్ షర్ట్ వలంటీర్ల గ్రామంలోని వీధుల్లో కవాతు నిర్వహించారు. జన సేవాదళ్ శిబిరానికి ఇన్‌స్ట్రక్టర్లుగా నార్ల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, హేమశంకర్, మురళీ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీఢీకొట్టడంతో పల్టీకొట్టిన ఆటో

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు

దుగ్గిరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న లారీ, పండ్లలోడుతో వెళుతున్న ఆటోను ఢీకొట్టడంతో నడిరోడ్డుపై పల్టీకొట్టింది. గురువారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తెనాలి మార్కెట్‌కు తర్బూజా, బొప్పాయి పండ్ల లోడుతో వస్తున్న లగేజీ ఆటోను తుమ్మపూడి సమీపంలో వెనుకవైపు నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొట్టింది. లారీఢీకొన్న వేగానికి ఆటోపల్టీకొట్టడంతో డ్రైవర్ తన్నీరు ఉదయ్‌కుమార్, తీవ్రంగా గాయ పడగా, ఆటోలోని తర్బూజా పండ్లు, బొప్పాయికాయలు రోడ్డుపైన పడి ప్రక్కనే ఉన్న బకింగ్‌హామ్ కాల్వలోకి పడిపోయాయి. గాయపడిన డ్రైవర్ ఉదయ్‌ను 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కైలాసగిరి కొండ ఆక్రమణలు తొలగిస్తాం

● జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ

మేడికొండూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆధీనంలోని కైలాసగిరి కొండ ప్రాంతాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ గురువారం పరిశీలించారు. కొండ దిగువ భాగాన వెలసిన ఆక్రమణల గురించి ఆయన స్థానిక అధికారులను ప్రశ్నించారు. జడ్పీ పరిధిలో ఉన్న కైలాసగిరి కొండ ప్రాంతంలో కొన్నాళ్లుగా కొందరు ఆక్రమించి గృహాలు, షాపులు నిర్మించారు. దీనిపై ఇటీవల ఫిర్యాదులు ఎక్కువగా అందాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన డిప్యూటీ సీఈవో పేరేచర్ల రెవెన్యూ సర్వే నెంబర్ 580లో కొండ ప్రాంతం ఉంది. కొండ దిగువ భాగంలోని భూమిని కొందరు ఆక్రమించుకొని పక్కా నిర్మాణాలు చేపట్టినట్టు ఆరోపణలు రావడంతో



కైలాసగిరి కొండ వద్ద ఆక్రమణలు పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ తదితరులు

సర్వే అధికారులను కూడా పిలిపించి జిల్లా పరిషత్ భూ సరిహద్దులు తేల్చాలని సూచించారు. కొండ దిగువ భాగాన ఆక్రమణదారులకు ఇంటి పన్ను వేయడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కొండపైన శివాలయం ఉండగా దిగుభాగంలో కొండ చుట్టూ ఆక్రమణలు పెరిగిపోతుండడంతో అధికారులు దీనిపై దృష్టి సారించారు. సరిహద్దు తేల్చిన వెంటనే అక్రమ అక్రమణలపై పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణ శంకర్రావు, పేరేచర్ల పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారావు, వైఎస్సార్‌సిపి నాయకులు మన్నవ రాజేష్, గ్రామ సర్వేయర్లు ఆదిలక్ష్మి, ఖాసిం తదితరులతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదు, తొలగింపు, సవరణలపై అవగాహన సదస్సు



ఓటరు నమోదు మార్పులు చేర్పుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఆర్వో గంగరాజు

తాడికొండ ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) ఓటు నమోదు, సవరణ, తొలగింపు తదితర విషయాలపై గురువారం తాడికొండ సాయిబాబ కల్యాణ మండపంలో అవగాహన సదస్సును నియోజకవర్గ ఈఆర్వో ఎం గంగరాజు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందుటకు ఫారం -6 ద్వారా ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌ద్వారా దాఖలు పరచవచ్చని తెలిపారు. చనిపోయిన వారు, ఇతర రాష్ట్రాలకు శాశ్వత వలసలు పోయిన వారి ఓటును ఫారం-7 ద్వారా తొలగించుటకు దాఖలు పరచవచ్చన్నారు. ఓటరు జాబితాలో ఓటరు పేరు, ఇంటి పేరు, అడ్రస్సు, పుట్టిన తేదీ, లింగం తప్పుగా నమోదైతే ఫారం-8 దాఖలు చేసి సరిచేసుకోవచ్చని తెలిపారు. వేరే ప్రాంతానికి ఓటు మార్చుకోవడానికి కూడా ఫారం-8తో చేసుకోవచ్చన్నారు. బీఎల్వోలు తమకు అసైన్ చేయబడిన అన్ని రకముల ఫారములను రెండు మూడు రోజుల్లో విచారించి సరైన నివేదికను తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి ఏఈఆర్‌వో లాగిన్‌కు పార్వర్డ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వో పి.మెహర్‌కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్, బీఎల్వోలు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన ప్రదర్శన

దుగ్గిరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చిలువూరులో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు ప్రయత్నం విరమించుకోవాలని కోరుతూ, దళితవాడలోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఎదుట పలువురు మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. తాము కూలి పనులకు ఇదేమార్గంలో వెళ్ళాలని, స్కూల్‌బస్‌లకు వెళ్లే చిన్నారులు సైతం ఇదేమార్గంలో నిత్యం పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుందని, రెండో దుకాణం దళితవాడ సమీపంలో ఏర్పాటు చేసే యోచన తక్షణమే విరమించుకోవాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ లీగల్‌సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో బుధవారం యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, అచీవర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ విద్యా ప్రదర్శనను వర్సిటీలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. బ్రిటన్‌కు చెందిన వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, విద్యావంతులు ఫెయిర్‌కు హాజరయ్యారు. ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్, బర్మింగ్‌హామ్ సిటీ యూనివర్సిటీ, మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు విద్యాపరమైన అంశాల్లో పలు సూచనలు చేశారు. ఆయా యూనివర్సిటీలలో అందుబాటులో ఉన్న కోర్సులు, ఫీజుల వివరాలు, అక్కడి వసతులు, ప్రయాణ సదుపాయాలు, వసతి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అల్యూమ్ని యూనియన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పనమ్ ఆరోబా, యూకే పార్లమెంట్ మాజీ సభ్యుడు వీరేంద్ర శర్మ, లక్ష్మీనరసింహన్ పాల్గొన్నారు.



ఫెయిర్‌లో పాల్గొన్న వర్సిటీల ప్రతినిధులు, విద్యావంతులు

నియోజకవర్గ కన్వీనర్ డైమండ్‌బాబు తీరుపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

తుళ్లూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ డైమండ్ బాబు తీరుపై మండల వైసీపీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేయకుండా ఎడంగా ఉన్న వారికి ఆయన పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గురువారం తుళ్లూరులో వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలోకం సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వైసీపీ నేతలు డైమండ్ బాబు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పగలు పూట ఒక పార్టీ.. రాత్రి పూట ఒక పార్టీలో మసలుతున్న వ్యక్తులు వైసీపీలో రాజ్యమేలుతున్నారని వైసీపీ క్రియాశీలక కార్యకర్త గంజిమళ్ల రమేష్ ఆరోపించారు. మరో సీనియర్ నేత కంతేటి పకీరు మాట్లాడుతూ లోకల్‌గా ఉన్న నాయకులను సంప్రదించకుండా పదవులు కట్టబెట్టారన్నారు. పార్టీకి పనిచేసిన వారికి గుర్తింపు లేకుండా డైమండ్ బాబు తీరుందన్నారు. బూత్ కమిటీ నెంబరు, మార్కెట్ యార్డు డైరెక్టర్ జొన్నకూటి ప్రశాంత్ మాట్లాడుతూ పోయిన ఎన్నికల్లో ఏజంట్‌లు కూడా వైసీపీకి దొరక్కపోవటంతో, కష్టపడి ఏర్పాటు చేసుకొని ఎన్నికల తంతు నిర్వహించామని చెప్పారు. టీడీపీకి సపోర్టుగా ఉన్న శాఖమూరుకు చెందిన బెజ్జ రాంబాబుకు వైసీపీ యువజన విభాగంలో పదవి ఇచ్చారని ఇది పార్టీకి ద్రోహం చేయటం కాదా.. అని ప్రశ్నించారు. ఏది ఏమైనా మండలంలో వర్గవిభేదాలతో వైసీపీ పూర్తిగా కనుమరుగయ్యే వాతావరణం స్పష్టంగా కనిపిస్తుందని ఆ పార్టీలో క్రియా శీలకంగా ఉన్న నేతలు చర్చించుకుంటున్నారు.

భూమి సారవంతం కోసం 30 రకాల విత్తనాలు



పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ ఉమాదేవి

ఫిరంగిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు రాక ముందు రైతులు పొలాలను సారవంతం చేసుకొనే దిశగా టీఎంటీఎస్ విత్తనాలను చల్లుకోవాలని జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ ఉమాదేవి అన్నారు. గురువారం మండలంలోని 113 తాళ్ళూరులో మిరియాల సాయిబాబా పొలంలో 30 రకాల విత్తనాలతో కూడిన రెండు కిట్లను భూమిలో చల్లించిన ఆమె రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం గ్రామంలో వంద కిట్లు, 30 రకాల తీగ జాతి, నూనెజాతి, పప్పు జాతి పలురకాల కూరల విత్తనాలను కలిపి ఒక్కో కిట్టు 12 కిలోల తూకంతో తయారు చేయించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, అన్నామణి, జల్లు రామకృష్ణ, మిక్కి తిరుపతిరావు, ఐసీఆర్‌పీలు ఏరువ లక్ష్మారెడ్డి, అరుణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి : ఎంఈవో

కాకుమాను, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. కాకుమాను ఎస్టీ కాలనీలో గురువారం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్ల వయస్సు దాటిన చిన్నారుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి, ఉచిత పాఠ్యపుస్తకాలు, సమదుస్తులు, డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనం తదితర అంశాల గురించి వివరించారు. విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

పెదనందిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పమిడివారిపాలెంలో ఘర్షణపై గురువారం పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. పోలీసు కథనం ప్రకారం కొమరవల్లి రాజశేఖర్ కాకుమాను గ్రామానికి వెళ్లి తిరగి స్వగ్రామానికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎడ్లూరి వేణుబాబు ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో పక్కకు తీయాలని కోరగా ట్రాక్టర్ తీసేదిలేదు అంటూ మరో ఐదుగురు రాజశేఖర్‌పై ఘర్షణకు దిగి కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదులో తెలిపారు. దీనిపై ఎస్‌ఐ మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేఎంసీ జిల్లా అధ్యక్షుడిగా బండారు వెంకటరమణ

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సెల్ (బీజేఎంసీ) జిల్లా అధ్యక్షుడిగా తాడేపల్లికి చెందిన బండారు వెంకటరమణ నియమితులయ్యాడు. విజయవాడలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాలి ఫాతుల్లా బాషా ఈ మేరకు ప్రకటన విడుదల చేసినట్టు వెంకటరమణ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ హర్షణీయం

● బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ దర్శనపు శ్రీనివాస్

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని భారతీయ జనతా పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో కన్వీనర్ దర్శనపు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మాదిగల 30 ఏళ్ల పోరాట విజయాన్ని ప్రతి పల్లెలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వర్గీకరణకు సహకరించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ బీజేపీ నేత సుజనా చౌదరి, ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో కృషి చేశారన్నారు. వర్గీకరణ కార్యసాధకుడు మంద కృష్ణమాదిగ చేసిన ప్రతి పోరాటంలో పైన పేర్కొన్న పెద్దలందరూ సహకరించారన్నారు. మాదిగలు అందరూ బీజేపీ, తెలుగుదేశం పార్టీకి రుణపడి ఉంటారని ఆయన తెలిపారు.

వాడవాడలా సంబరాలు నిర్వహించాలి

పెదనందిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఆర్డినెన్స్ విడుదల చేసిన సందర్భంగా వాడవాడలా సంబరాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం క్యాబినెట్‌లో ముసాయిదా బిల్లును గవర్నర్‌కు పంపడం జరిగిందని, గవర్నర్ ఆర్డినెన్స్ కూడా విడుదల చేశారని తెలిపారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ఇంటి వద్ద సంబరాలు చేయాలని తెలిపారు.

జీతభత్యాలు పెంచి రెగ్యులర్ చేయాలి



పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది

పెదనందిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సిబ్బందికి వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం నిరసన చేపట్టారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆరేళ్లుగా జీతభత్యాలు పెంచలేదని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ ప్రవళిక, రత్నకుమారి, మినోర్క్యూన్, స్వాతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

పెదనందిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక లావు వారి చెరువుకట్ట వద్ద రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల బ్రోచర్‌ను టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివలస ఛీఫ్ కోచ్, అధ్యక్షుడు సీహెచ్ రాము సహకారంతో జూన్ 8న రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో వెలినేని శివయ్య, మురళి, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

20న అద్దంకమ్మ ఆలయంలో లక్ష మల్లెల పూజ

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామ ప్రజల ఇలవేల్పు అద్దంకమ్మవారి దేవాలయం వద్ద లక్ష మల్లెలతో పూజ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ గ్రామంలో మారెమ్మ కొలుపుతో తిరునాళ్ల ప్రారంభమవుతుందన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు ఎంతోమేలు : ఏవో

పెదనందిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని ఏవో సుధారాణి అన్నారు. మండల పరిధిలోని వరగానిలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూమిలో సహజంగా ఎన్ని పోషకాలు ఉన్నాయి, వాటి ద్వారా వేయబోయే పంటకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చునన్నారు. దీని వల్ల చౌడుభూములు సారవంతంగా మార్చుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. మట్టి నమూనాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి ఆమె పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జరీనా, జ్యోత్స్న, షాలినీ, నజీరా తదితరులు పాల్గొన్నారు.

టీబీ గుర్తించి, నియంత్రించేందుకు చర్మ పరీక్షలు

దుగ్గిరాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత దేశంగా భారత్‌ను నిలిపేందుకు వైద్యులు అవిశ్రాంత కృషి చేస్తున్నారని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రహమాన్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో క్షయ బాధిత కుటుంబ సభ్యులకు సీవై టీబీ ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ పరీక్షలు గురువారం నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాల నుంచి వచ్చిన ఉత్కర్ష తివారీ మాట్లాడుతూ క్షయవ్యాధి అనుమానితులకు పరీక్షలు జరిపాక, క్షయవ్యాధిని గుర్తిస్తే, ప్రివెన్షన్ థెరపీద్వారా భవిష్యత్‌లో క్షయవ్యాధి రాకుండా చేయవచ్చునన్నారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ కె.రవికుమార్, సీహెచ్‌వో జానమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలకు ఏర్పాట్లు పూర్తి

పెదనందిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వరగానిలో ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి వారి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావులు గురువారం తెలిపారు. 18న అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం, 19న శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు, సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం, కళానికేతన్ వీరన్నపాలెం వారి రుతువులేని కాలం, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 20న విశ్వభారతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటిక, యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి కిడ్నాప్ అనే నాటికల పోటీలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు విశిష్ట అతిథులు హాజరవుతారని తెలిపారు.

హజ్ యాత్రికులకు అన్నివిధాలా సహకరిస్తా

● హజ్ కమిటీ సభ్యురాలు ఎంపీపీ జబీన్



ఎంపీపీ జబీన్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు, కార్యదర్శులు

దుగ్గిరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీలో స్థానం కల్పించినందుకు మంత్రి నారా లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని హజ్‌కమిటీ సభ్యురాలిగా నూతనంగా నియమించబడిన ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణ లో జబీన్‌ను టీడీపీ నాయకులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గురువారం ఘనంగా సత్కరించారు. జబీన్ మాట్లాడుతూ బీసీ ధ్రువీకరణపత్రం ఇవ్వకుండా ఎంపీపీ పదవి దక్కకుండా చేసి, మానసికంగా క్షోభకు గురిచేశారని, ఆపత్కాలంలో అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్, స్థానిక టీడీపీ నాయకులకు రుణపడి ఉంటానని అన్నారు. ఎంపీపీగా మండలప్రజలకు సేవలందిస్తూనే, మైనార్టీకి చెందిన మహిళగా, హజ్‌యాత్రకు వెళ్లే మైనార్టీలకు అవసరమైన సేవలను అందిం చడంలో తన వంతు కృషిచేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఎంపీటీసీలు విశ్వనాధపల్లి శివకుమార్, కొప్పుల మధుబాబు, టీడీపీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాసరావు, తోటకూర సీతారామయ్య, శేషగిరి, ఏసుపాదం, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, డీఎంపీడీవో జవహర్‌లాల్, ఏవో చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఫుడ్ టెక్నాలజీ పారిశ్రామిక సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తాడేపల్లి(వడ్డేశ్వరం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం పారిశ్రామిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాంటి నెంటల్ కాఫీ ఫ్యాక్టరీ నుంచి ప్రొడక్షన్ హెడ్ డాక్టర్ జె.విజయ శాంతి, ఆపరేషనల్ హెడ్ కె.విశ్వనాధ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై కాఫీ తయారీ, బ్లెండింగ్, ఎగుమతి చేసే కాఫీ పొడి నాణ్యతా ప్రమాణాల గురించి విద్యార్థులకు విశదీకరించారు. అనంతరం ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని విద్యార్థులకు పరిశోధనలపై నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించి ప్రచురించిన వారిలో ప్రతి విద్యా సంవత్సరం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విద్యార్థులను ఎంపిక చేసి సఫలతా సమ్మేళన్ 2025 పేరుతో ఏర్పాటు చేసిన సదస్సులో నగదును ప్రశంసాపత్రా లను అందజేశారు. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి కే శ్రీనివాసు లు, వీసీ సారధివర్మ, ప్రో వీసీలు ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగ దారులకు ఆఫర్

ఫిరంగిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్‌ను వినియోగించే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకొనే వెసులుబాటు ఏపీసీపీడీసీఎల్ అందిస్తున్నదని ఏఏవో ఈఆర్‌వో గుంటూరు ఏఈ చంద్రశేఖర్, మండల ఏఈ దుర్గాప్రసాదులు గురువారం తెలిపారు. 2025 మార్చి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఈ ఆఫర్ ఉంటుందన్నారు. సీఆర్‌డీఏ సర్కిల్, ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయం, ఈ సేవా కేంద్రం, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లలో నగదు చెల్లించుకోవాలన్నారు. ఒక కిలో వాట్‌కు రూ.వెయ్యి, రెండో కిలో వాట్ కు రూ.2వేలు, మూడు కిలో వాట్‌కు రూ.3వేలు, నాలుగు కిలో వాట్‌కు రూ 4వేలు, ఐదు కిలో వాట్‌కు రూ.5వేలు తగ్గింపుతో చార్జీలు చెల్లించుకోవచ్చని వారు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైల్వే స్టేషన్‌లో మహిళ మృతి



తెనాలి క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్ 1వ నెంబరు ఫ్లాట్ ఫాంపై తెనాలికి చెందిన రేపూరి నాగరజిత (60) గురువారం మృతిచెందింది. జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం రైలుకోసం వేచిచూస్తూ ఆమె మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చి కేసు నమోదుచేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు జేఎంజే కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఒంగోలులోని కూతురు వద్దకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైందన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. గురువారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చంద్రబాబుకాలనీకి చెందిన పెండాల నాగేశ్వరావు పెయింటర్‌గా జీవిస్తున్నాడు. బుధవారం పెయింటింగ్ పనికి వెళ్లి వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపాడు. ఉదయం పనికి వెళ్దామని చూడగా ద్విచక్ర వానం ఇంటిముందు లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

తెనాలిరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని నందివెలుగు జాషువానగర్‌లో 2022లో జరిగిన హత్యకేసులో రెండో నిందితుడిగా ఉన్న విజయవాడ నున్న మండలం కండ్రికకు చెందిన ఎస్‌కే జాన్‌బాబు కోర్టులో బెయిల్‌పై విడుదలై రెండు సంవత్సరాలుగా వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడిని పట్టుకుని గురువారం కోర్టు ఎదుట హాజరుపర్చగా నిందితునికి 14రోజులు నెల్లూరు సెంట్రల్‌జైల్‌కు రిమాండ్ విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఇరువర్గాలపై కేసు

తెనాలి రూరల్, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి)17: చిన్నారులు ఆటలాడుకునే సమయంలో ఏర్పడిన గొడవలో పెద్దలు కలుగజేసుకుని ఘర్షణకు దిగిన ఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని పెదరావూరు కాలనీలో ఈ నెల 12రాత్రి గరిక వెంకటేశ్వరరావు, కనపర్తి శిరీషల మధ్య పిల్లల ఆటల విషయంలో ఏర్పడిన వివాదంలో రెండు వర్గాలకు సంబంధించిన సుమారు 10మందిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



దుకాణంలోకి దూసుకెళ్ళిన ఇసుక లారీ

అదుపుతప్పిన లారీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని వేజెండ్ల అడ్డరోడ్డు వద్ద గురువారం ఇసుక లారీ ఆర్టీసీ బస్సును ఢీకొని, పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకువెళ్లింది. దుకాణంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. చేబ్రోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమా దం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు.

కాంగ్రెస్ పార్టీపై బీజేపీ కుట్రలు: డాక్టర్ సాంబశివుడు

తెనాలి క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అగ్రనేతలు కుట్రపూరిత చర్యలు చేపట్టారని తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో బలమైన ప్రతిపక్షం ఉంటేనే అధికార పక్షం నియంతపాలన లేకుండా సరైనబాటలో వెళుతుందన్నారు. కానీ ప్రధాని మోదీ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని తుదముట్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ కాంగ్రెస్ నేతలైన సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమ కేసులు బనాయించటం కుట్రపూరితం అన్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తోందని సాంబశివుడు తెలిపారు. సమావేశంలో పొన్నూరు నాగసూర్యశశిధర్, గుర్రపు ద్వారక శీను, కర్లపూడి బుల్లియ్య, శివకుమార్, రమేష్, స్టీవెన్‌బాబు, శంకరరావు, కోటేశ్వరరావు, అయ్యప్ప, సుబ్బారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం: కమిషనర్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తామని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. గురువారం కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం నాడు క్లీన్ అండ్ గ్రీన్, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో భాగంగా పట్టణంలో ఇ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్స్ వస్తువులు, కంప్యూటర్ పరికరాలు, మొబైల్స్, కేబుల్స్, బల్బులు, బ్యాటరీలు తదితర ఇ-వ్యర్థాలను శివాజీచౌక్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.00గం.ల లోపు అందజేయాలని మునిసిపల్ కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులను తీర్చిదిద్దేందుకు లోకేశ్ కృషి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సంస్కరణ చేపట్టి ప్రభుత్వ విద్యాలయాలను, విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియల్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం గురువారం కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం వలన ఎంతోమంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని చెప్పారు. నైపుణ్యాలు పెంపొందించుకోవడం వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చందు శ్రీరాములు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

దోచుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ధ్వజం
- విచారణ జరిపించి నిజనిజాలు తేలుస్తామన్న ఎంపీడీవో
- కొలకలూరులో రూ.2కోట్లు అవినీతి జరిగిందని ఎంపీటీసీ ఆరోపణ



ఉపాధి హామీ పనుల వివరాలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు కూలీలకు సొంత గ్రామాల్లోనే పనులు కల్పించి వారికి జీవనోపాధిని మెరుగుపరచాలని పభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెడితే అది పేదలకు బదులు పీల్డ్ అసిస్టెంట్లకు, ఏపీవోలకు వరంలా మారిందని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. గురువారం తెనాలి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉపాధి హామీ పథకంలో ఎన్నో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని వాటి పర్యవేక్షణ లోపంతో ఏపీవోలు, పీల్డ్ అసిస్టెంట్లు అందినంత దోచుకుంటున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపించారు. పేదల కోసం తీసుకువచ్చిన పథకం వారికి సక్రమంగా అందడంలేదన్నారు. గ్రామంలో పీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు నిబంధనల ప్రకారం కొలతలు వేయకుండా అదనపు కొలతలు వేస్తూ వారికి నచ్చిన వారి పేర్లు నమోదు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఏపీవో మండలంలోని 18గ్రామాల్లో చేపడుతున్న లక్షల రూపాయల ఉపాధి పనులను సభలో ప్రస్తావించగా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల్లో గ్రామసభల ద్వారా గుర్తించిన పనులు చేపట్టాల్సి ఉందని, వారి ఖాతాల్లో ఇప్పటికి ఎంత జమైంది. ఎన్ని రోజులు పనులు కల్పిస్తున్నారంటూ ప్రశ్నించారు. దీనిపై పూర్తి విచారణ జరపాలని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. అదే విధంగా కొలకలూరు గ్రామంలో ఇటీవల జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆ గ్రామ ఎంపీటీసీ కాళిశెట్టి ఫణికుమార్ సభలో లేవనెత్తారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.3000 వంతున వసూలు చేశారని ఇది నిబంధనలకు విరుద్ధం కాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో కార్యదర్శిగాని ఇతర అధికారులుగాని బాధ్యతగా పనిచేయడంలేదని విమర్శించారు. గత మూడేళ్లలో దాదాపుగా రూ.2కోట్లు అవినీతిజరిగిందని ఆరోపించారు. ట్యూబ్‌లైట్లు, ట్రాక్టర్ మెయింటినెన్స్, ఇతర పనుల పేరుతో రూ.లక్షల్లో బిల్లులు పెట్టి పంచాయతీ ఆదాయాన్ని పక్కదారి పట్టించారంటూ వ్యాఖ్యానించారు. పంచాయతీ, ఆర్ అండ్ బీ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నా వారిపై అధికారులు ఎటువంటి చర్యలకు ఉపక్రమించడంలేదంటూ సభలో మండిపడ్డారు. ఈ క్రమంలో అధికారులకు ఫణికుమార్‌కు మధ్య స్వల్ప వాదనలు చోటుచేసుకున్నాయి. సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ జయనాగలక్ష్మి తమ గ్రామంలో బస్‌స్టాప్ వద్ద బస్సులు ఆపడంలేదన్నారు. కఠెవరం, సోమసుందరపాలెం, తేలప్రోలు వంటి పలు గ్రామాల్లో విద్యుత్ ఫీడర్లు మంటలు వ్యాపించి కాలిపోతున్నాయని అధికారులు వీటిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపై విచారణ చేపడతామన్నారు. ఇకపై ఎంపీడీవో స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని, అదేవిధంగా గ్రామంలో ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకుని పనులు జరుగుతున్న తీరును పరిశీలించవచ్చన్నారు. ఎంపీడీవో దీప్తి మాట్లాడుతూ ఉపాధి హామి పథకంలో ప్రజాప్రతినిధులు తెలిపిన ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో ఆచంట శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఈవోపీఆర్డీ వైవైడీ ప్రసాద్ పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎన్‌యూ కళాశాలల వార్షికోత్సవం



కళాశాలల వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్నసీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత

పెదకాకాని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, కామర్స్, లా, సైన్స్, ఫార్మసీ కళాశాలల వార్షికోత్సం గురువారం ఘనంగా జరిగింది. వర్సిటీలో జరిగిన ఈ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా హైదరాబాదులోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎమ్ బాలలత హాజరై కార్యక్రమాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల లత మాట్లాడుతూ వెలకట్టలేని బంధం గురు శిష్యుల అనుబంధం అని కొనియాడారు. విద్యార్థులలో ప్రతిభ తోపాటు స్థిరత్వం ముఖ్యమని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధికారిగా విధినిర్వహణలో ఉన్న చిటికెల చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను, అభిరుచులను గుర్తెరిగి ఆ దిశగా కృషి చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని విధానాలను అందిపుచ్చుకోవాలని కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతికత నేడు సమాజంలోఅన్ని రంగాలలో ఎక్కువగా ఉంటున్నదన్నారు. వార్షికోత్సవ మహోత్సవానికి ఏఎన్‌యూ ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎమ్ సురేష్ కుమార్ సభాధ్యక్షత వహించారు. గతంలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన ప్రస్తుత రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, ఆచార్య కే గంగాధరరావు వంటి పలువురిని సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆచార్యులైన ఆచార్య ఎమ్ త్రిమూర్తి రావు, ఆచార్య వై అశోక్ కుమార్, ఆచార్య ఎస్‌వీ కృష్ణారావు, ఆచార్య పూర్ణచంద్రరావులను వర్సిటీ వీసీ రెక్టార్ రిజిస్ట్రార్, ఓ ఎస్‌డీ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఆచార్య ఎమ్ త్రిమూర్తి రావు, ఆచార్య సీ హెచ్ లింగరాజు, డాక్టర్ రవిశంకర్ రెడ్డి కన్వీనర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ విభాగాధిపతి డాక్టర్ జి కొండలరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కే వీరయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీమతి ఏ ప్రమీలరాణి పాల్గొన్నారు. ఈ వేడుకలలో దివ్యాంగ కళాకార బృందమైన స్వర నేత్ర వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. జానపద గాయకులు దామోదర గణపతి రావు బృందం జానపద గీతా లను ఆలపించారు. చలనచిత్ర గాయకురాలు సాయి శిల్ప సినీ గీతాలు ఆకట్టుకున్నాయి. వర్సిటీలోని డాన్స్ విభాగం వారు శాస్త్రీయ పాశ్చాత్య నృత్యాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు విద్యార్థి బృందాలకు బహుమతుల ప్రదానం చేశారు.

ఎన్నికల వాగ్దానాలు అమలుచేయాలి: సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ నాయకులు మహాధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు నివేశన స్థలం, గ్రామాలలో మూడు సెంట్లు నివేశన స్థలాలు ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణాలకు రూ.4 లక్షలు ఇస్తామని హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఆ వాగ్దానాల అమలుపై చర్యలు మాత్రం శూన్యం అని విమర్శలు గుప్పించారు. అనంతరం తహసీల్దార్ జియావుల్ హక్‌కు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఆరేటి రామారావు, దేవరకొండ శ్రీనివాస్, ఎల్లమ్మ, శారద, షకీల, యశోద, సారమ్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తెనాలి క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం రావి సాంబయ్య స్కూల్ ప్రాంగణంలో అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ పొందే మార్గాలను సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ ప్రవాహంలో ఉన్న విద్యుత్ పరికరాలకు షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుంటే నీళ్లు పోసి ఆర్పడానికి ప్రయత్నించవద్దన్నారు. కృత్రిమ శ్వాస, సీపీఆర్ విధానం, ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలు వంట గదుల్లో సంభవించే గ్యాస్ లీక్ ప్రమాదాల నుంచి ఏ విధంగా బయట పడాలో ప్రదర్శన పూర్వకంగా విద్యార్థులకు, స్థానికులకు అగ్నిమాపక సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: పట్టణంలోని వేద పాఠశాలలో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు ఫైర్ అధికారులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తూటికాడను పూర్తిగా తొలగించండి: మునిసిపల్ ఛైర్‌పర్సన్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో పేరుకొని పోయిన తుటికాడను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. గురువారం స్థానిక మారీసుపేట 23 వ వార్డులోని చంద్రబాబునాయుడు కాలనీలో ప్రధాన డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు పనులను తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ కుమార్, టీపీవో ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి: ఎంపీడీవో

కొల్లిపర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పని చేస్తున్న సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని పిడపర్రు, కొల్లిపర, అత్తోట సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పౌష్టికాహారంతోనే వ్యాధి నిరోధక శక్తి: సౌజన్యశ్రీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం స్వీకరించడంతోనే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కొడాలి సౌజన్యశ్రీ అన్నారు. గురువారం నందులపేట 4వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవ కార్యాక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొడాలి సౌజన్యశ్రీ గర్భిణీలు, బాలింతలకు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. లబ్ధిదారులకు టీహెచ్‌ఆర్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: గర్భిణులు పౌష్టికమైన ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా పుడతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు సెక్టార్‌లో అత్తోట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. అదే విధంగా మండలంలోని చక్రాయపాలెం, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో ఐసీడీఎస్ అధికారులు పౌష్టిక వారోత్సవాలను నిర్వహించారు.

దొప్పలపూడిలో విద్యుత్ లోక్ అదాలత్

● అర్జీలు స్వీకరించిన పరిష్కార వేదిక అధ్యక్షుడు



విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న పరిష్కార వేదిక అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేల్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొప్పలపూడి గోవాడ చౌదరి ఫంక్షన్ హాల్‌లో గురువారం విద్యుత్ లోక్ అదాలత్ జరిగింది. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షుడు ఎస్. విక్టర్ ఇమ్మానియేల్ స్వయంగా కక్షిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చాయని వాటి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను పరిష్కార వేదిక అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేల్ ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల సూపరిడెండెంట్ ఇంజినీర్ ఆంజనేయులు, టెక్నికల్ సిబ్బంది శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, సునీత, డీఈ శ్యాంకుమార్, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి డాక్టర్ శారద వైద్యసాయం

తెనాలి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాన్పుకోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించిన మహిళకు బిడ్డ అడ్డంతిరిగాడని గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్సకు రిఫర్ చేయడంతో ఇబ్బందులు పడుతున్న గర్భిణికి డాక్టర్ శారద వైద్యసేవలందించి తల్లీబిడ్డలను సురక్షితంగా కాపాడారు. వివరాల్లోకి వెళితే తెనాలికి చెందిన బొక్క సుమిత్రాదేవి ఈ నెల 2న కాన్పుకు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు భర్త మహేష్‌తో కలిసి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి బిడ్డ అడ్డం తిరిగిందని ఇక్కడ వైద్యం అందించడం కుదరదని గుంటూరు సమగ్ర వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. నొప్పులతో ఇబ్బంది పడుతున్న భార్యను ఆమె భర్త మహేష్ తెనాలిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్సకు నగదు ఎక్కువగా అడగడంతో విషయాన్ని గుంటూరు జిల్లా అధికారి కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన అధికారులు తహసీల్దార్ గోపాలకృష్ణకు గర్భిణీకి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో ఆమె ఇబ్బందిని చూసి చలించిన తహసీల్దార్ గోపాలకృష్ణ తెనాలిలోని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శారద దృష్టికి తీసుకువెళ్లారు. డాక్టర్ శారద పూర్తి ఉచితంగా గర్భిణికి శస్త్రచికిత్స ద్వారా డెలివరీ చేశారు. గురువారం తనకు పునర్జన్మనిచ్చిన డాక్టర్ శారదను, తనకు తక్షణవైద్యం అందేలా కృషిచేసిన తహసీల్దార్ గోపాలకృష్ణలను దంతులు సుమిత్ర, మహేష్‌లు కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత ప్రేరణతోనే మంచి ఫలితాలు

● మండల విద్యాశాఖాధికారులు చలపతిరావు, సుబ్బారావు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు చలపతిరావు, రాయల సుబ్బారావు తదితరులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత ప్రేరణతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని మండల విద్యాశాఖాధికారులు చలపతిరావు, రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని వేజెండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం పాఠశాల ఆవరణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కృషి చేయాలన్నారు. పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ పాఠశాలగా మారుతుందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య పెరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రేరణ శిక్షణ సేవా సమితి సెక్రటరీ నోటు నాగార్జున మాట్లాడుతూ విద్యార్థులను ఆంగ్ల భాషలో తర్ఫీదు ఇచ్చామని మంచి ఫలితాలు సాధనే ధ్యేయంగా సంస్థ పనిచేస్తోందన్నారు. అనంతరం వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, సంతోష్, ఎస్ఎంసీ ఛైర్మన్ తోట భువనేశ్వరి, మాజీ ఎస్‌ఎంసీ ఛైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాబుప్రసాద్ తదితరులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సంఘ సభ్యులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాబుప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాబుప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మంతివర్గ ఉపసంఘం వేస్తానని మాటతప్పిందని విమర్శించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికుడు చేసేపని కాంట్రాక్ట్ కార్మికులు కూడా చేస్తున్నారని వారికి వేతనాలు రూ.40వేలు ఉండగా మాకు తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ బండి శేషన్నను కలసి చాప్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న తన పరిధిలో ఉన్న ప్రతీ అంశాన్ని పరిశీలించి అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్ వలి, ఎం పద్మ, వి సుధాకర్, రాచూరి, జయలక్ష్మి, ఎం శ్రీను, నాగరాజు, అంజయ్య, లక్ష్మినారాయణ, నాగేంద్రబాబు, రత్నకుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

● వైద్యాధికారి డాక్టర్ మౌనిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. గురువారం స్థానిక గంగానమ్మపేటలోని పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతూ ఉన్న క్షయవ్యాధిగ్రస్తునితో నివసిస్తున్న కుటుంబంలో 18 సంవత్సరాలు దాటిన వారికి సీవైటీబీ టెస్ట్‌లను పట్టణ టీబీ యూనిట్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ ఆదేశాల మేరకు పట్టణంలో సీవై టీబీ టెస్ట్‌లు చేస్తున్నామన్నారు. క్షయవ్యాధి రహిత పట్టణంగా తెనాలి ఉండేందుకు ప్రతిఒక్క వైద్య సిబ్బంది, ప్రతి పౌరుడు కృషిచేయాలన్నారు. అనంతరం సాలిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా టీబీ టెస్ట్‌లను నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, డాక్టర్ ఉత్కర్ష తివారి, హెల్త్ విజిటర్లు దిలీప్‌కుమార్, భార్గవి, హెచ్‌వీ పుష్పలత, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.